# నవజ్యోతి

తెలుగు దినపత్రిక

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి: 01 సంచిక : 283 | ఎడిటర్.: మన్నే లక్ష్మణ్ | వెల:5/- | పేజీలు: 8 | ఆదివారం 02-08-2026


## జాతీయ రహదారి ఆక్రమణదారులకు సహకరిస్తున్న విద్యుత్ శాఖ..!



- ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు సాకుతో రోడ్డు ఆక్రమణ..
- నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

8

## డాక్టర్ పేరుతో దందా..సూరారంలో బోగస్ క్లినిక్ బట్టబయలు

- కుత్బుల్లాపూర్ ఎస్ఓటీ– సూరారం పోలీసుల సంయుక్త దాడి
- మెడికల్ అర్హతలు లేకుండానే ఏడాదిగా వైద్యం



5



## వరద బాధితులకు మంత్రి భరోసా

- మంగపేట పునరావాస కేంద్రాన్ని సందర్శించిన మంత్రి సీతక్క
- 28 కుటుంబాల 112 మందికి కల్పించిన సౌకర్యాలపై ఆరా
- ఆహారం, వైద్యం, పారిశుద్ధ్యంపై ప్రత్యేక ఆదేశాలు

2

పునరావాస కేంద్రాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క శనివారం సందర్శించారు.



# వరద శాంతించాలని గోదావరికి మంత్రి పూజలు

- వరద పరిస్థితిని పరిశీలించిన మంత్రి సీతక్క
- అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచన

**ములుగు, ఆగస్టు 1 (నవజ్యోతి ప్రతినిధి):**

గోదావరి వరద ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క శనివారం వాజేడు మండలం పుసూరు బ్రిడ్జి వద్ద వరద పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ బోర్డడే హేమంత్ సహ దేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. గోదావరి నదిలో వరద ప్రవాహాన్ని పరిశీలించిన మంత్రి సీతక్క పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మిగతా 2 లో..

## నామినేటెడ్ పోస్టుల భర్తీకి కసరత్తు



### రాష్ట్రవ్యాప్తంగా ప్రక్రియ ప్రారంభిస్తున్న కాంగ్రెస్

- రేపు జిల్లాల్లో ఇన్‌చార్జి మంత్రుల సమావేశాలు
- ఆశావాహుల పేర్లను పీసీసీకి పంపాలని ఆదేశాలు
- పీసీసీ, సీఎం నిర్ణయాల మేరకే భర్తీ ప్రక్రియ: తుమ్మల

**హైదరాబాద్, ఆగస్టు 1 (నవ జ్యోతిప్రతినిధి):**

రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలకు అనుగుణంగా నియామక ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆదివారం ఇన్‌చార్జి మంత్రులు సమావేశాలు

మిగతా 2 లో..

## తల్లి పాలపై అవగాహన పెంచాలి

- ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి సీతక్క పిలుపు

2





## మహిళా బాక్సర్లకు సీఎం అభినందనలు

- కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణ పతకాలు గెలిచిన జాస్మిన్, ప్రీతికి శుభాకాంక్షలు
- భారత కీర్తిని చాటిన విజయమని కొనియాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్ష
- భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని అభిలాష

2

## తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగింపు

- హైదరాబాద్, నవయోతి
- సర్వదర్శనానికి 15 గంటల నిరీక్షణ
- 31 కంపార్ట్‌మెంట్లలో వేచిచూ స్తున్న భక్తులు
- ఒక్కరోజే 71 వేల మందికి పైగా శ్రీవారి దర్శనం
- హుండీ ఆదాయం రూ.4.46 కోట్లు

**తిరుమల, ఆగస్టు 1 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):**

తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ శనివారం ఓ మోస్తరుగా కొనసాగుతోంది. వారాంతం కావడంతో భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతుండగా, టోకెన్లు లేని భక్తులు శ్రీవారి సర్వదర్శనం కోసం సుమారు 15 గంటల పాటు వేచి ఉండాల్సి వస్తోంది. ప్రస్తుతం 31 కంపార్ట్‌మెంట్లలో భక్తులు దర్శనం కోసం నిరీక్షిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. శుక్రవారం ఒక్కరోజే 71,393 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

మిగతా 2 లో..





## ఈ20 పెట్రోల్‌పై ఆప్ ఆందోళన

- ఆగస్టు 4న ప్రధాని నివాసానికి కేజ్రీవాల్ మార్చ్
- రెండు లక్షల సంతకాలతో పిటిషన్ సమర్పిస్తామని వెల్లడి
- ఈ20 పెట్రోల్‌పై మూడు డిమాండ్లు ప్రకటించిన ఆప్

2

## ప్రజాస్వామ్యానికి స్వేచ్ఛాయుత మీడియా అవసరం

- నవతెలంగాణ వార్షికోత్సవ సెమినార్‌లో కేటీఆర్ ప్రసంగం
- దేశంలో మీడియా స్వేచ్ఛ క్షీణిస్తోందని వ్యాఖ్య

2



## సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన పొన్నం



2

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన మంత్రి పొన్నం ప్రభాకర్
- సుప్రీంకోర్టు తీర్పుపై ధన్యవాదాలు తెలిపిన మంత్రి
- సాగునీటి ప్రాజెక్టులకు కొత్త ఊపు వస్తుందని వ్యాఖ్య



2

## మీ సేవకు కొత్త రికార్డు

ఒక్క రోజులో 2.20 లక్షల లావాదేవీలతో

## భోగాపురం అభివృద్ధికి నాంది: పవన్

### ఉత్తరాంధ్రకు కొత్త దిశ చూపనున్న అంతర్జాతీయ విమానాశ్రయం

- మోదీ, చంద్రబాబు నాయకత్వాన్ని కొనియాడిన ఉప ముఖ్యమంత్రి
- కూటమి ప్రభుత్వంతో రాష్ట్ర అభివృద్ధి వేగవంతమైందని వ్యాఖ్య

2

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం సరికొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు.



## వరద శాంతించాలని గోదావరికి మంత్రి పూజలు

**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా గోదావరి వరద శాంతించాలని మంత్రి సీతక్క ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు క్షేమంగా ఉండాలని, వరద ఉద్ధృతి తగ్గాలని ప్రార్థనలు చేశారు. స్థానిక ప్రజలు కూడా ఈ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పునరావాస ఏర్పాట్లపై అధికారులు నిరంతరం దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. జిల్లా యంత్రాంగం అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని సహాయక చర్యలను వేగవంతం చేయాలని, అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన సిబ్బంది, యంత్రాంగం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వస్సల్ టోప్పోతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

## నామినేటెడ్ పోస్టుల భర్తీకి కసరత్తు

**మొదటిపేజీ తరువాయి**

నిర్వహించాలని మంత్రి తుమ్మల సూచించారు. ఈ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, జిల్లా ఇన్‌చార్జ్‌లు పాల్గొని సమన్వయంతో నామినేటెడ్ పోస్టులకు సంబంధించిన ఆశావాహుల పేర్లను ఖరారు చేయాలని తెలిపారు. ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జ్‌లు పరస్పర సమన్వయంతో పనిచేసి అర్హులైన అభ్యర్థుల వివరాలను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి పంపించాలని మంత్రి ఆదేశించారు. పార్టీ బలోపేతం, సమర్థవంతమైన పాలన లక్ష్యంగా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని కార్పొరేషన్ చైర్మన్ పదవులు, వివిధ నామినేటెడ్ పోస్టులు, సహకార సంఘాల పదవులు, డైరెక్టర్ల పోస్టులను దశలవారీగా భర్తీ చేయనున్నట్లు తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. అన్ని నియామకాలు పార్టీ నాయకత్వం నిర్ణయాలకు అనుగుణంగా ఉంటాయని తెలిపారు. నియామక ప్రక్రియలో పారదర్శకత, సమన్వయానికి ప్రాధాన్యం ఇస్తామని మంత్రి పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం పార్టీ నాయకత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు లభించేలా నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపడుతున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. త్వరలోనే వివిధ కార్పొరేషన్లు, బోర్డులు, సహకార సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ పూర్తవుతుందని పేర్కొన్నారు.

## తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగింపు

**మొదటిపేజీ తరువాయి**

వీరిలో 27,846 మంది తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం రోజంతా రద్దీగా కనిపించింది. భక్తుల కానుకల ద్వారా శ్రీవారి హుండీకి ఒక్కరోజులో రూ.4.46 కోట్ల ఆదాయం సమకూరినట్లు టీటీడీ వెల్లడించింది. భక్తుల విశ్వాసానికి నిదర్శనంగా హుండీ ఆదాయం కొనసాగుతోందని అధికారులు తెలిపారు. అదే రోజు 4.33 లక్షల శ్రీవారి లడ్డూలను విక్రయించినట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. అలాగే 2.58 లక్షల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అన్నప్రసాద కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తిరుమలలోని వివిధ వైద్య కేంద్రాల ద్వారా 3,285 మంది భక్తులకు వైద్య సేవలు అందించినట్లు అధికారులు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వైద్య బృందాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శనం, వసతి, లడ్డూ పంపిణీ, అన్నప్రసాదం, భద్రత తదితర ఏర్పాట్లను టీటీడీ మరింత పటిష్ఠం చేసింది. భక్తులు అధికారుల సూచనలు పాటిస్తూ సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

## సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన పొన్నం

**హైదరాబాద్, ఆగస్టు 1 (నవజ్యోతి ప్రతినిధి):**

గౌరవెల్లి ప్రాజెక్టుతో పాటు పాలమూరు–రంగారెడ్డి, సీతమ్మ సాగర్ ప్రాజెక్టులకు గతంలో మంజూరైన పర్యావరణ అనుమతులను కొనసాగిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ, సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున సమర్థవంతంగా న్యాయపోరాటం నిర్వహించడంతో ఈ అనుకూల తీర్పు వచ్చిందని అన్నారు. న్యాయవాది అభిషేక్ సింఘ్వీ సేవలు కూడా ఈ విజయంలో కీలకంగా నిలిచాయని పేర్కొన్నారు. గౌరవెల్లి, పాలమూరు–రంగారెడ్డి, సీతమ్మ సాగర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టుల అమలుకు ఈ తీర్పు కొత్త ఊపునిస్తుందని మంత్రి తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణ పనులు వేగవంతమై రాష్ట్ర అభివృద్ధికి మరింత తోడ్పాటు అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు అనేక ప్రాంతాల తాగునీటి అవసరాలు కూడా తీరుతాయని మంత్రి పేర్కొన్నారు. రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు గ్రామీణ ప్రాంతాల సామాజిక, ఆర్థికాభివృద్ధికి ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని తెలిపారు. తెలంగాణ హక్కులను పరిరక్షించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న చొరవ, ప్రభుత్వం సాగించిన న్యాయపోరాటం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు.

## ప్రజాస్వామ్యానికి స్వేచ్ఛాయుత మీడియా అవసరం

**హైదరాబాద్, ఆగస్టు 1 (నవజ్యోతి ప్రతినిధి):**

నవతెలంగాణ 11వ వార్షికోత్సవం సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన "రాజ్యాంగం–ప్రజాస్వామ్యం–పత్రికా స్వేచ్ఛ" అంశంపై సెమినార్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. నవతెలంగాణ 11 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంస్థకు శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో మీడియా స్వేచ్ఛ రోజురోజుకూ క్షీణిస్తోందని కేటీఆర్ అన్నారు. మీడియా సంస్థలు తమ ఉనికిని కాపాడుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, అనేక సంస్థలు ఏదో ఒక వర్గానికి మద్దతుగా వ్యవహరిస్తున్న పరిస్థితి నెలకొందని వ్యాఖ్యానించారు. వార్తను వార్తగానే రాసే పరిస్థితి లేకుండా పోయిందని, తప్పు జరిగినా నిర్భయంగా చెప్పలేని పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. స్వేచ్ఛాయుత మీడియా, నిర్భయమైన జర్నలిజం ప్రజాస్వామ్యానికి అత్యంత అవసరమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. స్వేచ్ఛకు ఎలాంటి పరిమితులు ఉండకూడదని, నిజాలు చెప్పేవారిని నిర్బంధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రభుత్వంలో ఉన్నవారు విద్వేషపూరిత వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా వల్ల ప్రభుత్వాల్లో జవాబుదారీతనం పెరిగిందని కేటీఆర్ అన్నారు. యువత సోషల్ మీడియా ద్వారా ప్రశ్నిస్తూ మార్పును కోరుతోందని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రాజకీయ పార్టీలు కూడా మారాల్సిన అవసరం ఉందన్నారు.

# వరద బాధితులకు మంత్రి భరోసా

**ములుగు, ఆగస్టు 1 (నవజ్యోతి ప్రతినిధి):**

జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వస్సల్ టోప్పోతో కలిసి గోదావరి వరద పరిస్థితిని పరిశీలించి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడారు. బ్యాక్‌వాటర్ ప్రభావంతో ముంపునకు గురయ్యే ప్రాంతాలకు చెందిన 28 కుటుంబాల 112 మందిని సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. వారికి కల్పిస్తున్న తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, పారిశుద్ధ్య సౌకర్యాలు తదితర అంశాలపై మంత్రి ఆరా తీశారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మంగపేటలో నిర్మిస్తున్న గోదావరి కరకట్ట పనుల పురోగతిని కూడా మంత్రి పరిశీలించారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరిలో వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నది పరివాహక ప్రాంతాల్లోని ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న ప్రతి కుటుంబానికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందించాలని మంత్రి స్పష్టం చేశారు. ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్యం వంటి అంశాల్లో ఎలాంటి లోటు లేకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. బాధితులను పరామర్శించి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ముంపు బాధితులకు శాశ్వత ప్రాతిపదికన ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి సీతక్క తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వరద పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన సహాయక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, తహసీల్దార్ తోట రవీందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహిళా బాక్సర్లకు సీఎం అభినందనలు

**హైదరాబాద్, ఆగస్టు 1 (నవ జ్యోతి ప్రతినిధి):**

గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో మహిళల బాక్సింగ్‌లో స్వర్ణ పతకాలు సాధించిన జాస్మిన్ లాంబోరియా, ప్రీతి పవార్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మహిళల 57 కిలోల విభాగంలో జాస్మిన్ లాంబోరియా, 54 కిలోల విభాగంలో ప్రీతి పవార్ స్వర్ణ పతకాలు గెలుచుకోవడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. భారత జెండాను అంతర్జాతీయ వేదికపై రెపరెపలాడించిన ఈ ఇద్దరు బాక్సర్లకు ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. వారి అద్భుత ప్రదర్శన దేశ క్రీడా రంగానికి మరింత గౌరవాన్ని తీసుకొచ్చిందని అన్నారు. జాస్మిన్ లాంబోరియా, ప్రీతి పవార్ ప్రదర్శించిన అంకితభావం, కృషి, పట్టుదల యువ క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కష్టపడి సాధించిన విజయాలు భావితరాలకు స్ఫూర్తినిస్తాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా అంతర్జాతీయ పోటీల్లో ఇదే స్థాయిలో రాణించి మరిన్ని పతకాలు సాధించాలని, ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేయాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. దేశ క్రీడాకారుల విజయాలకు తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అంతర్జాతీయ క్రీడల్లో భారత క్రీడాకారులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో భారత మహిళా బాక్సర్ల విజయం దేశవ్యాప్తంగా ఆనందాన్ని నింపిందని ముఖ్యమంత్రి తెలిపారు. దేశానికి మరిన్ని పతకాలు అందించి భారత కీర్తిని ప్రపంచవ్యాప్తంగా చాటాలని జాస్మిన్ లాంబోరియా, ప్రీతి పవార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## నామినేటెడ్ పోస్టుల భర్తీకి కసరత్తు

**మొదటిపేజీ తరువాయి**

రాజకీయ జీవితంలో జెడ్పీటీసీగా ఎన్నికైన 20 ఏళ్ల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉరుకొండపేటలో అడుగు పెట్టిన ముఖ్యమంత్రికి గ్రామస్థులు, ఆనాటి సహచరులు, పెద్దలు ఘన స్వాగతం పలికారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ముఖ్యమంత్రి తనతో కలిసి పనిచేసిన పాత సహచరులను ఆప్యాయంగా పలకరించారు. ఒక్కొక్కరితో కరచాలనం చేస్తూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రెండు దశాబ్దాల క్రితం జరిగిన రాజకీయ ప్రయాణానికి సంబంధించిన అనుభవాలను గుర్తు చేసుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సహచరులు 20 ఏళ్ల క్రితం తీసుకున్న ఫొటోలను చూపిస్తూ అప్పటి సంఘటనలను ముఖ్యమంత్రికి గుర్తు చేశారు. గ్రామ ప్రజల ప్రేమాభిమానాలు ఎప్పటికీ మరువలేనివని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదం, సహచరుల సహకారంతోనే తన రాజకీయ ప్రయాణం ఈ స్థాయికి చేరుకుందని అన్నారు. ఆలయ అభివృద్ధి పనులు పూర్తయితే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీలు వేమ్ నరేందర్ రెడ్డి, మల్లు రవి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## భోగాపురం అభివృద్ధికి నాంది: పవన్

**భోగాపురం, ఆగస్టు 1 (నవజ్యోతి ప్రతినిధి):**

విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో రాష్ట్రం దేశంలో అగ్రగామిగా ఎదుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం "వికసిత్ భారత్" లక్ష్యంతో వేగంగా ముందుకు సాగుతోందని పవన్ కల్యాణ్ అన్నారు. 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు మోదీ నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం కూడా అన్ని రంగాల్లో దేశాన్ని పురోగతి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో "ఎర్ర బస్సు కూడా రాని చోట ఎయిర్‌బస్ అవసరమా?" అంటూ విమర్శించిన వారికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయమే సమాధానమని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలక కేంద్రంగా మారుతుందని, ఉపాధి, పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త అవకాశాలు తీసుకువస్తుందని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో మూడు పార్టీలు కలిసి పనిచేయడం వల్ల అభివృద్ధి మరింత వేగవంతమైందని పవన్ కల్యాణ్ తెలిపారు. ఇదే అభివృద్ధి కోసం 2024 ఎన్నికల్లో ప్రజల మద్దతు కోరినట్లు గుర్తుచేశారు. రాష్ట్ర ప్రయోజనాలే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై గతంలో చేసిన విమర్శలు తనను బాధించాయని పవన్ కల్యాణ్ అన్నారు. ఎన్ని విమర్శలు, అవమానాలు ఎదురైనా మోదీ వెనక్కి తగ్గకుండా దేశం కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. తనను విమర్శించిన వారిని కూడా క్షమించే గొప్ప మనస్తత్వం ప్రధాని మోదీదని పేర్కొన్నారు. దేశాభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెనుక ప్రజలంతా బలంగా నిలవాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

## ఈ20 పెట్రోల్‌పై ఆప్ ఆందోళన

**న్యూఢిల్లీ, ఆగస్టు 1 (నవజ్యోతి ప్రతినిధి) :**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ20 పెట్రోల్ విధానానికి వ్యతిరేకంగా ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆందోళనకు పిలుపునిచ్చారు. ఆగస్టు 4న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం వరకు మార్చ్ నిర్వహించి, రెండు లక్షల మందికి పైగా మద్దతు తెలిపిన పిటిషన్‌ను సమర్పించనున్నట్లు ప్రకటించారు. న్యూఢిల్లీలో శనివారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన కేజ్రీవాల్, ఈ20 పెట్రోల్‌కు వ్యతిరేకంగా ఆన్‌లైన్ పిటిషన్‌కు ఇప్పటికే రెండు లక్షల మందికి పైగా మద్దతు లభించిందన్నారు. ఆ పిటిషన్‌ను ప్రధానమంత్రి నివాసానికి తీసుకెళ్లి సమర్పిస్తామని తెలిపారు. ఈ మార్చ్‌లో పెద్ద సంఖ్యలో ప్రజలను తీసుకురావడం కంటే, ఉద్యమానికి సిద్ధంగా ఉన్న పరిమిత సంఖ్యలో కార్యకర్తలతోనే పాల్గొంటామని చెప్పారు. ఈ20 పెట్రోల్ విషయంలో కేంద్ర ప్రభుత్వం మూడు డిమాండ్లను అంగీకరించాలని కేజ్రీవాల్ కోరారు. స్వచ్ఛమైన పెట్రోల్ లేదా ఈ20 పెట్రోల్ వాడాలనే నిర్ణయాన్ని పూర్తిగా వాహనదారులకే వదిలేయాలని, ఈ20 పెట్రోల్‌ను తప్పనిసరి చేయరాదన్నారు. ఒకవేళ తప్పనిసరి చేస్తే సాధారణ పెట్రోల్ కంటే తక్కువ ధరకే విక్రయించాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గిన నేపథ్యంలో దేశంలో లీటరు పెట్రోల్ ధరను రూ.84 కంటే తక్కువకు అందుబాటులోకి తీసుకురావాలని కేజ్రీవాల్ కోరారు. ప్రస్తుతం ఈ20 పెట్రోల్ వినియోగంతో వాహనదారులకు ఎలాంటి ప్రయోజనం కలగడం లేదని, మైలేజీ తగ్గడం, వాహనాల పనితీరుపై ప్రభావం పడుతున్నట్లు ఆరోపించారు. ఇథనాల్ ఉత్పత్తి వల్ల పర్యావరణంపై కూడా ప్రతికూల ప్రభావం ఉంటుందని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. రైతులకు, దేశ ఆర్థిక వ్యవస్థకు ఆశించిన స్థాయిలో ప్రయోజనం కలగడం లేదని ఆరోపించారు.

## తల్లి పాలపై అవగాహన పెంచాలి

**హైదరాబాద్, ఆగస్టు 1 (నవజ్యోతి ప్రతినిధి):**

ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు (ఆగస్టు 1–7) సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ప్రతి తల్లి, ప్రతి కుటుంబానికి తల్లిపాల ప్రాముఖ్యతను చేరవేసేలా ఉద్యమంలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. తల్లి పాలు ప్రతి శిశువుకు తొలి హక్కు, ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ పోషకాహారమని మంత్రి తెలిపారు. పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు శిశువుకు తొలి రోగనిరోధక టీకాలా పనిచేస్తాయని పేర్కొన్నారు. ప్రతి శిశువుకు పుట్టిన గంటలోపే తల్లిపాలను ప్రారంభించి, తొలి ఆరు నెలలు కేవలం తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. ఆరు నెలల తర్వాత వయస్సుకు తగిన అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగించడం ద్వారా పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు బలమైన పునాది ఏర్పడుతుందని మంత్రి వివరించారు. తల్లి పాల వారోత్సవాలను కేవలం అధికారిక కార్యక్రమాలుగా కాకుండా ప్రజల్లో చైతన్యం కలిగించే ఉద్యమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, గ్రామాలు, వార్డుల్లో అవగాహన సమావేశాలు, ఇంటింటి సందర్శనలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించి తల్లిపాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగిస్తూ శాస్త్రీయ అవగాహన కల్పించాలని, కుటుంబ సభ్యులను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని మంత్రి కోరారు. ప్రతి ఆసుపత్రిలో ప్రసవం జరిగిన గంటలోపే శిశువుకు తల్లిపాలు అందేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. పోషకాహార లోపం లేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క తెలిపారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయడంలో ప్రజాప్రతినిధులు, వైద్యులు, మహిళా సంఘాలు, అంగన్వాడీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, ప్రతి కుటుంబం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందించేలా సమాజమంతా బాధ్యతతో ముందుకు రావాలని కోరారు.

## మీ సేవకు కొత్త రికార్డు

**హైదరాబాద్, ఆగస్టు 1 (నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక డిజిటల్ పౌర సేవా వేదిక 'మీ సేవ' మరో కీలక మైలురాయిని అధిగమించింది. జూలై 31న ఒక్కరోజే రికార్డు స్థాయిలో 2,20,172 లావాదేవీలు నమోదై మీ సేవ చరిత్రలోనే అత్యధిక రోజువారీ లావాదేవీలుగా నిలిచాయని రాష్ట్ర సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పౌరులకు వేగవంతమైన, పారదర్శకమైన, ప్రజా కేంద్రిత సేవలు అందించాలనే లక్ష్యంతో మీ సేవ వేదికను నిరంతరం బలోపేతం చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. సేవల విస్తరణ, సాంకేతిక పరిజ్ఞానం ఆధునీకరణ, వ్యవస్థ పనితీరు మెరుగుదల, కొత్త సేవల అనుసంధానం వల్ల ఈ ఘనత సాధ్యమైందని వివరించారు. సాధారణంగా రోజుకు 70 వేల నుంచి 80 వేల వరకు లావాదేవీలు నమోదయ్యే మీ సేవలో ఒకే రోజులో 2.20 లక్షలకు పైగా లావాదేవీలు జరగడం డిజిటల్ పాలనపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని మంత్రి అన్నారు. ఆ రోజు అత్యధికంగా కుటుంబ కార్డు దరఖాస్తులు, రవాణా శాఖ సేవలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు నమోదయ్యాయని తెలిపారు. ఇంత భారీ స్థాయిలో లావాదేవీలు జరిగినప్పటికీ ఎలాంటి సాంకేతిక అంతరాయాలు లేకుండా సేవలు అందించగలిగామని మంత్రి వెల్లడించారు. సమర్థత, విశ్వసనీయత, నిరంతర సేవల పరంగా మీ సేవ దేశంలోనే అగ్రశ్రేణి ప్రభుత్వ డిజిటల్ సేవా వేదికగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సేవలందించిన మీ సేవ కేంద్రాల నిర్వాహకులు, వివిధ శాఖల అధికారులు, సాంకేతిక బృందాలను మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. వారి సమిష్టి కృషి వల్లే ఈ రికార్డు సాధ్యమైందని ప్రశంసించారు.

# ఏఐ... మానవత్వాన్ని భర్తీ చేయగలదా?

- **రోబో శస్త్రచికిత్స చేయగలదు... కానీ రోగి చేయి పట్టి ధైర్యం చెప్పగలదా?...**

**నవజ్యోతి ఎడిటోరియల్ | ఆగస్టు 1**



ఒకప్పుడు విద్యుత్ ప్రపంచాన్ని మార్చింది. తరువాత కంప్యూటర్ విప్లవం వచ్చింది. ఆ తర్వాత ఇంటర్నెట్ మానవ జీవితాన్ని పూర్తిగా కొత్త దిశలో నడిపించింది. ఇప్పుడు ప్రపంచం మరో కీలకమైన మార్పు దశలో నిలిచింది. అదే ఏఐ విప్లవం. ఇది కేవలం మరో కొత్త సాంకేతికత కాదు. మనిషి నేర్చుకునే విధానం, పనిచేసే తీరు, నిర్ణయాలు తీసుకునే పద్ధతి, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్నే మార్చగల శక్తిగా ఎదుగుతోంది. వైద్యం, విద్య, వ్యవసాయం, న్యాయవ్యవస్థ, పరిశ్రమలు, బ్యాంకింగ్, మీడియా, అంతరిక్ష పరిశోధనలు... నేడు ఏ రంగం చూసినా ఏఐ తన ముద్ర వేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు, సాంకేతిక సంస్థలు ఈ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. కారణం ఒకటే—భవిష్యత్తు ప్రపంచ అభివృద్ధిలో ఏఐ కీలక పాత్ర పోషించబోతుందనే విశ్వాసం. "ఇటీవల ప్రపంచ ప్రముఖ పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యలు ఈ చర్చకు మరింత ఊతమిచ్చాయి. రాబోయే కొద్ది సంవత్సరాల్లో ఏఐ ఆధారిత రోబోలు అనేక శస్త్రచికిత్సల్లో అత్యుత్తమ మానవ సర్జన్ల స్థాయికి చేరుకోవచ్చని, కొన్ని సందర్భాల్లో వారికంటే మెరుగైన ఖచ్చితత్వాన్ని కూడా ప్రదర్శించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ఏఐ అనేక రంగాల్లో మానవ మేధస్సును అధిగమించే అవకాశముందని కూడా పేర్కొన్నారు. ఇవి భవిష్యత్తుపై చేసిన అంచనాలే అయినప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా ఏఐ అభివృద్ధి వేగాన్ని చూస్తే ఈ చర్చను విస్మరించే పరిస్థితి లేదు." వైద్యరంగంలో ఇప్పటికే ఏఐ విశేష ఫలితాలను ఇస్తోంది. అమెరికా సహా అనేక దేశాల్లో రోబో ఆధారిత శస్త్రచికిత్సలు సాధారణమవుతున్నాయి. వేలాది ఎక్స్‌రేలు, సీటీ స్కాన్లు, ఎంఆర్ఐ చిత్రాలను క్షణాల్లో విశ్లేషించి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించే సామర్థ్యాన్ని ఏఐ ప్రదర్శిస్తోంది. చర్మ క్యాన్సర్, కంటి రెటీనా సమస్యలు, రొమ్ము క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధుల గుర్తింపులో కూడా అనేక పరిశోధనల్లో మంచి ఫలితాలు నమోదయ్యాయి. అయితే...వ్యాధిని గుర్తించడం ఒకటి... మనిషిని అర్థం చేసుకోవడం మరొకటి. ఒక వైద్యుడు కేవలం మందులు రాయడు. రోగి కళ్లలో కనిపించే భయాన్ని చదువుతాడు. కుటుంబ సభ్యుల ఆందోళనను అర్థం చేసుకుంటాడు. క్యాన్సర్ రోగికి చికిత్స మాత్రమే కాదు, జీవించాలనే ధైర్యాన్ని కూడా ఇస్తాడు. శస్త్రచికిత్సకు ముందు భుజంపై చేయి వేసి "భయపడొద్దు... అంతా బాగానే ఉంటుంది" అని చెప్పే మాటకు విలువను ఏ యంత్రం కొలవలేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచనం ప్రకారం ఆరోగ్యం అంటే కేవలం వ్యాధి లేకపోవడం కాదు. శారీరక, మానసిక, సామాజిక శ్రేయస్సు కలిసే నిజమైన ఆరోగ్యం. అందుకే వైద్యం అనేది కేవలం పరీక్షలు, మందులు, శస్త్రచికిత్సల సమాహారం కాదు. అది విశ్వాసం, బాధ్యత, మానవత్వం, కరుణల సమ్మేళనం. ప్రపంచ ప్రఖ్యాత పరిశోధనా పత్రిక నేచర్ మెడిసిన్లో ప్రచురితమైన అధ్యయనాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఏఐ వైద్యుడిని భర్తీ చేయడానికి కాదు... వైద్యుడి సామర్థ్యాన్ని పెంచడానికి ఉపయోగపడుతుంది. భారీ దత్తాంశాన్ని వేగంగా విశ్లేషించడం, పొరపాట్లను తగ్గించడం, ముందస్తు హెచ్చరికలు ఇవ్వడం వంటి అంశాల్లో అది అద్భుత సహాయకుడు. కానీ తుది నిర్ణయం తీసుకోవడం, నైతిక బాధ్యత వహించడం, అనుకోని పరిస్థితుల్లో స్పందించడం, రోగి కుటుంబంతో మాట్లాడడం వంటి అంశాల్లో ఇప్పటికీ మనిషే కేంద్రబిందువు.

**ఇది వైద్యరంగానికే పరిమితం కాదు.**

నేడు విద్యార్థులు ఏఐతో చదువుతున్నారు. న్యాయవాదులు చట్టాలను విశ్లేషిస్తున్నారు. జర్నలిస్టులు సమాచారాన్ని సేకరిస్తున్నారు. రైతులు వాతావరణ అంచనాలు తెలుసుకుంటున్నారు. బ్యాంకులు మోసాలను గుర్తిస్తున్నాయి. పరిశ్రమలు ఉత్పత్తిని నియంత్రిస్తున్నాయి. ప్రభుత్వ సేవల్లోనూ, డిజిటల్ చెల్లింపుల్లోనూ ఏఐ వినియోగం వేగంగా పెరుగుతోంది.

**అయితే మరో ప్రశ్న ఎదురవుతోంది.**

మనిషి ఆలోచించే సామర్థ్యం క్రమంగా తగ్గిపోతుందా?

ఒకప్పుడు లెక్కలు మనమే చేసేవాళ్లం. ఇప్పుడు యంత్రం చేస్తోంది. ఒకప్పుడు దారులు మనకు గుర్తుండేవి. ఇప్పుడు దారి చూపే పరికరం లేకపోతే గమ్యం చేరడం కష్టమవుతోంది. ఒకప్పుడు వ్యాసాలు, ప్రసంగాలు, లేఖలు మనమే రాసేవాళ్లం. ఇప్పుడు వాటిని కూడా ఏఐ రూపొందిస్తోంది. రేపు నిర్ణయాలు కూడా యంత్రాలే తీసుకుంటే... మనిషి పాత్ర ఏమిటి? ప్రపంచ ఆర్థిక వేదిక అంచనాల ప్రకారం రాబోయే సంవత్సరాల్లో కోట్లాది ఉద్యోగాల స్వరూపం మారబోతోంది. కొన్ని ఉద్యోగాలు తగ్గవచ్చు. అదే సమయంలో కొత్త నైపుణ్యాలతో కొత్త అవకాశాలు కూడా పుట్టుకొస్తాయి. వ్యవసాయ విప్లవం, పారిశ్రామిక విప్లవం, కంప్యూటర్ విప్లవం జరిగినప్పుడల్లా ఇదే జరిగింది. పాత వ్యవస్థలు మారాయి. కొత్త ప్రపంచం ఏర్పడింది. ఏఐ కూడా అదే దిశగా ప్రయాణిస్తోంది.

**అందుకే భయపడాల్సింది ఏఐని కాదు... దాన్ని ఎలా ఉపయోగిస్తున్నామన్నదే.**

విద్యా విధానం కూడా కాలానికి అనుగుణంగా మారాలి. కేవలం డిగ్రీలు, మార్కులు సరిపోవు. సృజనాత్మకత, సమస్యలను పరిష్కరించే నైపుణ్యం, నైతిక విలువలు, భావోద్వేగ మేధస్సు, నాయకత్వ లక్షణాలు, మానవ సంబంధాలు—ఇవే రేపటి ప్రపంచంలో మనిషిని ప్రత్యేకంగా నిలబెడతాయి. ఒక గురువు విద్యార్థిలో ఆత్మవిశ్వాసాన్ని నింపగలడు. ఒక తల్లి ప్రేమను ప్రపంచంలోని ఏ యంత్రం ఇవ్వలేదు. ఒక రైతు చెమట విలువను ఏ రోబో అర్థం చేసుకోలేదు. ఒక సైనికుడి త్యాగాన్ని ఏ కంప్యూటర్ అనుభవించలేదు. ఒక జర్నలిస్టు సమాజం కోసం అడిగే ప్రశ్నను ఏ అల్గారిథమ్ అడగలేదు. యంత్రానికి సమాచారం ఉంటుంది... మనిషికి అనుభవం ఉంటుంది.యంత్రానికి వేగం ఉంటుంది... మనిషికి వివేకం ఉంటుంది.

**యంత్రం సమాధానం ఇవ్వగలదు... మనిషి ఆశను ఇవ్వగలడు.**

భవిష్యత్తు మనిషి–యంత్రం మధ్య పోటీ కాదు. ఒకరినొకరు బలోపేతం చేసుకునే భాగస్వామ్యం. ఏఐ మనిషికి సేవ చేసే సాధనంగా ఉంటే అది మానవాళికి వరం. కానీ మానవత్వాన్ని, నైతిక విలువలను, స్వతంత్ర ఆలోచనను బలహీనపరిస్తే అదే సాంకేతికత సమాజానికి సవాలుగా మారుతుంది.

**సాంకేతికత ఎంత వేగంగా పరిగెత్తినా... మానవత్వాన్ని దాటలేదు.**

రోబో శస్త్రచికిత్స చేయగలదు... కానీ రోగి చేయి పట్టి ధైర్యం చెప్పగలదా? ఏఐ లక్షల పుస్తకాలు చదవగలదు... కానీ తల్లి ప్రేమను నేర్చుకోగలదా? యంత్రం ప్రపంచాన్ని మార్చగలదు... కానీ ప్రపంచాన్ని మరింత మానవీయంగా మార్చగలదా? ప్రపంచాన్ని ముందుకు నడిపేది సాంకేతికత కావచ్చు... కానీ దానికి దిశ చూపేది ఎప్పటికీ మానవత్వమే.

**–సాయి మణికంఠ**
**మేనేజింగ్ ఎడిటర్**

# ఎన్యూమరేషన్ ఫారం నింపితేనే ఓటు సురక్షితం

**కూకట్‌పల్లి, ఆగస్టు 1, (నవజ్యోతి ప్రతినిధి):**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా శేరిలింగంపల్లి తారానగర్‌లో జరుగుతున్న ఎన్యూమరేషన్ పనులను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తిగా నింపి, సంతకం చేసి బిఎల్వోలకు అందజేస్తేనే ఓటు హక్కు లభిస్తుందని స్పష్టం చేశారు. ఎన్యూమరేషన్ ఫారం సమర్పించిన అనంతరం బిఎల్వోల నుంచి రసీదు (అక్నాలెడ్జ్‌మెంట్) తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, ఫారం సమర్పించకపోతే భవిష్యత్తులో సంక్షేమ పథకాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. గేటెడ్ కమ్యూనిటీలు, హైరైజ్ బిల్డింగ్స్ అసోసియేషన్లు బిఎల్వోల సేకరణకు సహకరించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎల్వోలు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



# నాట్ల సీజన్‌లో రైతులకు దొంగల దెబ్బ

- **గుర్జకుంట–బస్వాపూర్ శివారులో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం.. నెల రోజుల్లో 15 ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్ల చోరీ...**

**భిక్కనూరు, ఆగస్టు 1 (నవజ్యోతి ప్రతినిధి):**



భిక్కనూరు మండలంలోని గుర్జకుంట–బస్వాపూర్ శివారులో దొంగలు మరోసారి రెచ్చిపోయారు. శుక్రవారం రాత్రి నాలుగు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి వాటిలోని విలువైన కాపర్ వైర్లను అపహరించారు. దీంతో సాగునీటి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే ప్రాంతంలో గడిచిన నెల రోజుల వ్యవధిలోనే పలు దఫాలుగా మొత్తం 15 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి కాపర్ వైర్లను దొంగిలించినట్లు స్థానికులు తెలిపారు. వరుస ఘటనలతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతుండగా, గ్రామస్తులు పలుమార్లు పోలీసులకు ఫిర్యాదులు అందజేశారు. వర్షాలు కురిసి నాట్లు వేస్తూ పంటలపై ఆశలు పెట్టుకుంటున్న సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని దొంగలు వరుస చోరీలకు పాల్పడుతుండడం రైతులను కలవరపెడుతోంది. ఈ ఘటనపై గుర్జకుంట గ్రామ సర్పంచ్ సంతోష్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "గడిచిన నెల రోజుల వ్యవధిలోనే వరుసగా ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్లు దొంగిలించడం అత్యంత దురదృష్టకరం. వర్షాలతో రైతులు నాట్లు వేసి మంచి పంటపై ఆశలు పెట్టుకున్న వేళ ఇలాంటి ఘటనలు జరగడం వారి మనోధైర్యాన్ని దెబ్బతీస్తోంది. కొద్దిపాటి కాపర్ కోసం రైతుల కష్టాన్ని నాశనం చేయడం అమానుషం. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి" అని కోరారు. ఇదిలా ఉండగా, ఈ వరుస చోరీల కేసులు పోలీసులకు సవాల్‌గా మారాయి. దుండగులను గుర్తించేందుకు ప్రత్యేకంగా దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. చోరీలకు పాల్పడుతున్న వారిని తప్పకుండా గుర్తించి చట్టం ముందు నిలబెడతామని పోలీసులు గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

## భిక్కనూరు ఎస్సైకి టీజీవీపీ నాయకుల సన్మానం

### విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతి...



**భిక్కనూరు, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి):**

టీజీవీపీ విద్యార్థి నాయకులు శనివారం భిక్కనూరు ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎస్సై దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు సంజయ్, కామారెడ్డి టౌన్ ఇన్‌చార్జి సమీర్, భిక్కనూరు మండల అధ్యక్షుడు భరత్, మండల ఉపాధ్యక్షుడు విజయ్, శివ, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ ప్రాణాలు కాపాడిన దోమకొండ పోలీసులు

### సమయస్ఫూర్తితో స్పందించిన హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ ను అభినందించిన ఎస్పీ..




**దోమకొండ, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి):**

దోమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ మహిళను పోలీసులు సకాలంలో స్పందించి సురక్షితంగా కాపాడారు. డయల్–100కు సమాచారం అందిన వెంటనే హెడ్ కానిస్టేబుల్ గంగయ్య, కానిస్టేబుల్ రాజు సంఘటనా స్థలానికి చేరుకుని అప్రమత్తంగా వ్యవహరించి మహిళ ప్రాణాలను రక్షించారు. ఈ ఘటనలో విధి నిర్వహణలో సమయస్ఫూర్తి ప్రదర్శించిన హెడ్ కానిస్టేబుల్ గంగయ్య, కానిస్టేబుల్ రాజును జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే డయల్–100కు సమాచారం అందించాలని, ప్రతి ప్రాణం అమూల్యమైనదని ఆయన సూచించారు. సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని, ఇబ్బందులు ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా సంబంధిత అధికారుల సహాయం తీసుకోవాలని ఎస్పీ పేర్కొన్నారు.

## వర్షా నికి దెబ్బతిన్న ఇండ్లను పరిశీలించిన సర్పంచ్



**భిక్కనూర్, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి):**

భిక్కనూర్ పట్టణంలోని 11వ వార్డులో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న ఇండ్లను సర్పంచ్ రేఖ సుదర్శన్ పరిశీలించారు. బాధిత కుటుంబాలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డు సభ్యుడు సురేష్ గౌడ్, జీపీఓ కాశిరాం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్ పాల్గొని బాధితులకు ప్రభుత్వం తరపున తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 10న 'హలో మాల – చలో ఢిల్లీ' కార్యక్రమం విజయవంతం చేయాలి

### బైండ్ల అశోక్ కుమార్

**సంగారెడ్డి, జూలై 31 (నవజ్యోతి ప్రతినిధి)**

ఆగస్టు 10న ఢిల్లీలో నిర్వహించనున్న 'హలో మాల – చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిస్తూ సంగారెడ్డి జిల్లా అంధక్షుల బ్లైండ్ ఆర్థిక్ కుమార్, మత్స్యకారులు, కాంద్రేగులపల్లి ప్రజా ప్రతినిధులు, పలువురు నాయకులు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా మాల సంఘం న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాలల సామాజిక, విద్యా, ఉపాధి హక్కుల సాధన కోసం పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సంగారెడ్డి జిల్లా నుంచి అధిక సంఖ్యలో ప్రజలు ఢిల్లీకి తరలివెళ్లేందుకు ఇప్పటికే ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పలువురు సామాజిక సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

# ముని్సిపల్ బిల్లుల చెల్లింపుల్లో రూ.1.70 కోట్ల అవకతవకలు

### కలెక్టర్ కు బీజేపీ కౌన్సిలర్ల ఫిర్యాదు...



**కామారెడ్డి, ఆగస్టు 1 (నవజ్యోతి ప్రతినిధి):**

కామారెడ్డి మున్సిపాలిటీలో నూతన పాలకవర్గం ఏర్పడిన తర్వాత జరిగిన బిల్లుల చెల్లింపుల్లో సుమారు రూ.1.70 కోట్ల మేర అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ బీజేపీ కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.5.92 కోట్ల వ్యయంలో 75 బిల్లులకు సంబంధించిన రూ.1.13 కోట్ల చెల్లింపులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధుల్లో రూ.71.28 లక్షల వ్యయంలో 5 బిల్లులకు సంబంధించిన రూ.59.86 లక్షల చెల్లింపులపై అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులు, ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## ట్రాన్స్ ఫార్మర్ చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

### రైతులు యాంటీ థెఫ్ట్ బోల్టులు ఏర్పాటు చేసుకోవాలని భిక్కనూరు పోలీసుల విజ్ఞప్తి...

**భిక్కనూరు, ఆగస్టు 1 (నవజ్యోతి ప్రతినిధి):**




భిక్కనూరు మండల పరిధిలో ఇటీవల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి కాయిల్స్ వరుసగా చోరీకి గురవుతున్న నేపథ్యంలో రైతులు, గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భిక్కనూరు పోలీసులు విజ్ఞప్తి చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లకు యాంటీ థెఫ్ట్ బోల్టులను వెల్డింగ్ చేయించుకోవడం ద్వారా చోరీలను అరికట్టవచ్చని సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వ్యవసాయ పొలాలు, ట్రాన్స్‌ఫార్మర్ల పరిసర ప్రాంతాలపై నిఘా ఉంచాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే భిక్కనూరు పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100, 112కు సమాచారం ఇవ్వాలని ఎస్సై ఎస్. అనిల్ కోరారు. ప్రజల సహకారంతో నిందితులను త్వరగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం సాధ్యమవుతుందని తెలిపారు.

## 5వ వార్డులో ఘనంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ...

**ముమ్మిడివరం, ఆగస్టు 1 (నవజ్యోతి ప్రతినిధి: రెడ్డి వీరబాబు):**



ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని 5వ వార్డులో శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని సచివాలయం సిబ్బంది సజావుగా నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి పెన్షన్లను అందజేశారు. ఈ సందర్భంగా 5వ వార్డు మాజీ కౌన్సిలర్, ముమ్మిడివరం నగర పంచాయతీ మాజీ ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అందజేశారు. అనంతరం వారిని ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొనగా, లబ్ధిదారులు సకాలంలో పెన్షన్లు అందజేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది.

## ఫీజుల బకాయిలపై బీజేవైఎం సంతకాల సేకరణ..

### చేగుంటలో విద్యార్థుల విశేష స్పందన



**తూప్రాన్, 01 ఆగష్టు ( నవజ్యోతి ప్రతినిధి నవీన్ ):**

చేగుంట లో ఫీజుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం చేపట్టిన “ఫీజుల బకాయి – బీజేపీ లాడాయి” కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చేగుంట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంతకాల సేకరణ, మిస్డ్ కాల్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేవైఎం చేగుంట నాయకుడు వంశీ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు 300 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సంతకాలు చేయడంతో పాటు మిస్డ్ కాల్ ఇచ్చి తమ మద్దతును తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫీజుల బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు ఉదయ్, ప్రవీణ్, శివకుమార్, రామకృష్ణ, వెంకటేష్‌తో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# అంతులేని బంధం ‘స్నేహం’...

### నేడు స్నేహితుల దినోత్సవం

**హైదరాబాద్, ఆగస్టు 1 (నవజ్యోతి ప్రతినిధి టి రాజగోపాల్) :**



కాలంతో పాటు ట్రెండ్స్ మారినా, ఎప్పటికీ మారనిది ఒక్కటే... అదే నిజమైన స్నేహం. అంతం లేని ఈ అమూల్యమైన బంధానికి పేరే ‘ఫ్రెండ్‌షిప్’. స్నేహం యొక్క గొప్పతనాన్ని, దాని పవిత్రతను ఎందరో మహానుభావులు, రచయితలు తమ కలాల ద్వారా ఎంతో అద్భుతంగా వర్ణించారు. జీవిత గమనంలో స్నేహమే ఒక బలం మానవ జీవితంలో అమ్మ, నాన్న, గురువు ఎంతటి ముఖ్యమైన స్థానాన్ని కలిగి ఉంటారో... ఒక మంచి స్నేహితుడు కూడా అంతే ప్రాధాన్యతను కలిగి ఉంటాడు. రక్తం పంచుకు పుట్టకపోయినా, కష్టసుఖాల్లో తోడుంటూ జీవితాంతం నీడలా నిలిచే బంధం స్నేహం ఒక్కటే. మనం తప్పు చేసినప్పుడు మందలించి, మంచి మార్గంలో నడిపించే గుణం ఒక్క స్నేహితుడికే సాధ్యం.మనసు విప్పి మాట్లాడుకునే ఏకైక ఆప్తుడ్జీ వితంలో ఎవరికీ చెప్పుకోలేని బాధలను, గుండెల్లో దాచుకున్న సంతోషాలను నిస్సంకోచంగా, ఎటువంటి భయం లేకుండా పంచుకోవడానికి ప్రతి ఒక్కరికీ గుర్తొచ్చే ఏకైక ఉత్తమ మార్గం ‘స్నేహితుడు’. ముఖం చూసి మనసులోని భావాన్ని కనిపెట్టే ఆత్మీయత ఈ బంధం సొంతం. ఒంటరితనంలో ఓదార్పుగా, విజయాల్లో మనకంటే ఎక్కువ ఆనందించేది మన ప్రియ నేస్తమే.స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు నేడు ‘ఫ్రెండ్‌షిప్ డే’ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ పాత జ్ఞాపకాలను, చిన్ననాటి ముచ్చట్లను నెమరువేసుకుంటున్నారు. దూరంగా ఉన్న స్నేహితులకు ఫోన్ల ద్వారా, సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు.

# అప్పుల భారంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం

- **తండ్రి వైద్యం కోసం చేసిన అప్పులు భరించలేక తీవ్ర నిర్ణయం.. కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో విషాదం !**

**కామారెడ్డి, ఆగస్టు 1 (నవజ్యోతి ప్రతినిధి):**





బాన్సువాడకు చెందిన 30 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గతక రాజు అప్పుల భారం, కుటుంబ బాధ్యతల ఒత్తిడిని తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడిన విషాద ఘటన కామారెడ్డి రైల్వే స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం, శుక్రవారం ఉదయం 10.20 గంటల సమయంలో కామారెడ్డి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం–3 సమీపంలోని లూప్ లైన్ వద్ద రాజు మృతి చెందినట్లు గుర్తించారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ సాఫ్ట్‌వేర్ సంస్థలో గత ఆరు సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తున్న రాజు కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్నాడు. రెండేళ్ల క్రితం తండ్రి గంగాధర్‌కు పక్షవాతం రావడంతో చికిత్స కోసం సుమారు రూ.15 లక్షలు ఖర్చు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇందుకోసం బంధువులు, స్నేహితుల వద్ద అప్పులు చేయాల్సి వచ్చిందని, తండ్రి ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో పాటు అప్పుల భారం పెరగడం రాజును తీవ్ర మానసిక ఒత్తిడికి గురి చేసిందని వారు వాపోయారు. "ఇంటి బాధ్యతలన్నీ వాడే చూసుకునేవాడు. అప్పుల గురించి తరచూ బాధపడేవాడు. ఇంకా పెళ్లి కూడా కాలేదు" అని తల్లి లక్ష్మి , అన్న శరత్ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. రాజు మృతితో బాన్సువాడలో విషాద ఛాయలు అలుముకున్నాయి. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, "ఆత్మహత్య ఏ సమస్యకూ పరిష్కారం కాదు. మానసిక ఒత్తిడి లేదా అప్పుల సమస్యలు ఎదురైతే కుటుంబ సభ్యులు, స్నేహితులతో మాట్లాడాలి. అవసరమైతే నిపుణుల సహాయం తీసుకోవాలి" అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మీరు లేదా మీకు తెలిసిన ఎవరైనా తీవ్ర మానసిక ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నట్లయితే, ఉచిత ప్రభుత్వ మానసిక ఆరోగ్య సేవ Tele-MANAS ను 14416 వద్ద 24 గంటలూ సంప్రదించవచ్చు. మరిన్ని వివరాలు: https://telemanas.mohfw.gov.in/home.

# సర్ ప్రక్రియలో కాంగ్రెస్ కృషి అభినందనీయం

- **రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ ఇలియాస్ అలీ హర్షం..**
- **మండల కాంగ్రెస్ అధ్యక్షులకు ప్రశంసా పత్రాలు అందజేసిన డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్**

**కామారెడ్డి, ఆగస్టు 1 (నవజ్యోతి ప్రతినిధి):**




కామారెడ్డి నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ విజయవంతంగా పూర్తికావడం పట్ల రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ ఇలియాస్ అలీ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ నాయకత్వంలో, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో సర్ ప్రక్రియ దాదాపు 100 శాతం విజయవంతంగా పూర్తైందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కే పునాదని, ప్రతి అర్హుడైన ఓటరికి న్యాయం జరిగేలా ఇంటింటికీ వెళ్లి నిబద్ధతతో పనిచేసిన బి ఎల్ ఏ లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, బూత్ స్థాయి నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ విజయానికి మార్గదర్శకులైన మహమ్మద్ అలీ షబ్బీర్, ఏలే మల్లికార్జున్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇదే సేవా స్ఫూర్తితో గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ మాట్లాడుతూ, సర్ ప్రక్రియను విజయవంతం చేసిన మండల కాంగ్రెస్ అధ్యక్షులు, బూత్ లెవల్ ఏజెంట్ల సేవలను కొనియాడారు. వారి కృషిని గుర్తిస్తూ మండల కాంగ్రెస్ అధ్యక్షులకు ప్రత్యేక ప్రశంసా పత్రాలు అందజేశారు. అర్హులైన ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా పనిచేసిన ప్రతి బి ఎల్ ఎ, నాయకుడు అభినందనీయుడని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే సేవా స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ ఇలియాస్ అలీ, కామారెడ్డి టౌన్ అధ్యక్షుడు సందీప్, ఆయా మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, సంబంధిత మండల నాయకులు, బి ఎల్ ఎలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భిక్కనూర్ బస్టాండ్‌లో మరుగుదొడ్లు, అదనపు బస్సులు ఏర్పాటు చేయాలి

### డిపో మేనేజర్‌కు సర్పంచ్ రేఖ సుదర్శన్ వినతి..

**భిక్కనూర్, ఆగస్టు 1 (నవజ్యోతి ప్రతినిధి):**



భిక్కనూర్ మండల కేంద్రంలోని ప్రయాణికుల ప్రాంగణంలో మూతపడిన మరుగుదొడ్లను వెంటనే అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు పల్లె వెలుగు బస్సులు నడపాలని గ్రామ సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్ డిపో మేనేజర్ ప్రదీప్‌కు వినతిపత్రం పంపించారు. భిక్కనూర్ బస్టాండ్ నిరంతరం ప్రయాణికులతో రద్దీగా ఉంటుందని, హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాలకు వెళ్లే వారికి ఇది ప్రధాన కూడలిగా మారిందని వినతిపత్రంలో పేర్కొన్నారు. గతంలో మహిళలు, చిన్నారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు ప్రస్తుతం వినియోగంలో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వెంటనే వాటిని వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. అలాగే ఉదయం వేళల్లో కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుందని, ఈ నేపథ్యంలో ఉదయం 8 గంటలకు, 8.30 గంటలకు భిక్కనూర్ నుంచి అదనపు పల్లె వెలుగు బస్సులు నడపాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నుంచి కామారెడ్డి మార్గంలో ఉదయం 6 గంటల నుంచి 6.30 గంటల మధ్య కూడా అదనపు బస్సులు ఏర్పాటు చేసి ప్రయాణికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సర్పంచ్ సూచనల మేరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, సిద్ధరామేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ లింబాద్రి, కాంగ్రెస్ నాయకులు రాజబాబు, విజయ్ డిపో మేనేజర్ ప్రదీప్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

## జాతీయ రహదారిపై కంటైనర్ బీభత్సం.. అంబేద్కర్ విగ్రహం ధ్వంసం...

**ముమ్మిడివరం ఆగస్టు 1 :(నవ జ్యోతి ప్రతినిధి రెడ్డి వీరబాబు)**




ముమ్మిడివరం మండలం 10వ మైలురాయి సెంటర్ పరిధిలో జాతీయ రహదారిపై శనివారం ఉదయం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వస్తున్న ఓ కంటైనర్ అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఢీకొట్టడంతో విగ్రహం దిమ్మతో సహా పూర్తిగా ధ్వంసమైంది. స్థానికుల సమాచారం ప్రకారం, ప్రమాద ప్రాంతంలో ఏర్పాటు చేసిన వేగ నియంత్రణ బారికేడ్లను పట్టించుకోకుండా కంటైనర్ వేగంగా దూసుకొచ్చింది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి ఎదురుగా వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును తప్పించే క్రమంలో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై కొంతసేపు భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అంబేద్కర్ విగ్రహం ధ్వంసం కావడంపై దళిత సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే కొత్త అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

# కేకే నగర్ ఫేస్ -1లో మంచి నీటి సమస్య పరిష్కరించాలని జలమండలి మేనేజర్ కు వినతి..!



**రాజేంద్రనగర్ ఆగస్టు 01 (నవజ్యోతి ప్రతినిధి)**

రాజేంద్రనగర్ సర్కిల్ గంధంగూడ పరిధిలోని కె.కె. నగర్ ఫేస్ -1 కాలనీ పరిసర ప్రాంతాల్లో తీవ్రంగా నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కె.కె. నగర్ ఫేస్ -1 రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, శాంతి ఎస్టేట్స్ ప్రతినిధులు శనివారం హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఎస్ బి కిస్మత్పూర్ సెక్షన్ మేనేజర్ నరేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ... గంధంగూడ సమీపంలోని డంపింగ్ యార్డ్ కారణంగా భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయని, బోర్లలో వచ్చే నీరు వినియోగానికి అనర్హంగా మారిందన్నారు. తమ ప్రాంతంలోని ప్రజలందరూ జలమండలి సరఫరా చేసే నీటిపైనే ఆధారపడి ఉన్నామని. నాలుగు రోజులకు ఒకసారి మాత్రమే సరఫరా అవుతున్న హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ నీరు కూడా తగిన ఒత్తిడితో రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. జలమండలి అధికారులు వెంటనే స్పందించి శ్రీనివాస్‌నగర్ నుంచి కె.కె. నగర్-1 కాలనీ సంపు వరకు ఉన్న పాత, చిన్న పైపుల స్థానంలో కొత్త 9 అంగుళాల పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ప్రస్తుతం అమర్చిన 7 హెచ్‌పీ మోటారు స్థానంలో గతంలో ఉన్న 10 హెచ్‌పీ మోటారును తిరిగి ఏర్పాటు చేసి, ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మేనేజర్ నరేష్ సమస్యలపై సానుకూలంగా స్పందించి, త్వరలోనే 10 హెచ్‌పీ మోటారును ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కె.కె. నగర్‌కు చెందిన రమేష్, రాము, కార్తీక్, శ్రీనివాస్, రేవంత్, శాంతి ఎస్టేట్స్‌కు చెందిన రామన్న, శ్రీనివాస్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ పేరుతో దందా.. సూరారంలో బోగస్ క్లినిక్ బట్టబయలు

- **కుత్బుల్లాపూర్ ఎస్‌వోటీ– సూరారం పోలీసుల సంయుక్త దాడి**
- **మెడికల్ అర్హతలు లేకుండానే ఏడాదిగా వైద్యం**
- **నిందితుడిపై కేసు నమోదు..దర్యాప్తు ముమ్మరం**

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 1: (నవజ్యోతి ప్రతినిధి)**

వైద్య సేవల పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న బోగస్ క్లినిక్‌పై సూరారం పోలీసులు, కుత్బుల్లాపూర్ ఎస్‌వోటీ బృందం సంయుక్తంగా దాడి చేసి నకిలీ డాక్టర్‌ను అరెస్ట్ చేశారు. సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో జూలై 31న విశ్వసనీయ సమాచారం మేరకు వెంకటరామ నగర్‌లోని బచ్‌పన్ స్కూల్ సమీపంలో నిర్వహిస్తున్న "రక్షిత క్లినిక్"లో తనిఖీలు నిర్వహించగా అసలు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం, సనాది కర్ణాకర్ (35) ఎలాంటి గుర్తింపు పొందిన వైద్య విద్యార్హతలు, మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ లేదా చట్టబద్ధమైన లైసెన్స్ లేకుండానే డాక్టర్‌గా చెలామణి అవుతూ సుమారు ఏడాది కాలంగా క్లినిక్ నిర్వహిస్తున్నాడు. రోగులను పరీక్షించడం, మందులు ఇవ్వడం, కన్సల్టేషన్ ఫీజులు వసూలు చేయడంతో పాటు మందుల విక్రయం ద్వారా అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నట్లు విచారణలో తేలింది. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు సంబంధిత చట్టాల కింద






కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇలాంటి నకిలీ వైద్యుల వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉన్నందున, వైద్య సేవలు పొందే ముందు వైద్యుడి అర్హతలు, మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్, లైసెన్స్‌ను తప్పనిసరిగా ధృవీకరిం చుకోవాలని పోలీసులు సూచించారు. తమ ప్రాంతాల్లో బోగస్ క్లినిక్‌లు లేదా నకిలీ వైద్యులు నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

# వెల్దుర్తిలోనే తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి

## కలెక్టర్, డీఈఓకు గ్రామస్థుల వినతి

**తూప్రాన్, 01 ఆగష్టు ( నవజ్యోతి ప్రతినిధి నవీన్ ) :**

మెదక్ జిల్లా వెల్దుర్తి గ్రామానికి నూతనంగా మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను కుకునూరు గ్రామానికి తరలించవద్దని కోరుతూ వెల్దుర్తి గ్రామస్థులు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)రాజుకు వినతిపత్రం సమర్పించారు.వెల్దుర్తి గ్రామానికి మంజూరైన పాఠశాలను మరో గ్రామానికి తరలించడం సరికాదని పేర్కొన్న గ్రామస్థులు, పాఠశాలను యథావిధిగా వెల్దుర్తిలోనే ఏర్పాటు చేసి విద్యా సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. పాఠశాలనుకుకునూరుకు తరలించడం వల్ల వెల్దుర్తి గ్రామానికి చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రవాణా, విద్యా సౌకర్యాల పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు వివరించారు. గ్రామ పిల్లల విద్యాభవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తీసుకున్న నిర్ణయాన్నిపునఃపరిశీలించి, తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను వెల్దుర్తిలోనే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.



ఈకార్యక్రమంలో గ్రామసర్పంచ్ ఆదర్శ్ ఉపసర్పంచ్ శ్రవణ్ కుమార్ పాముబండ శేఖర్ నవీన్ పటేల్ కోదండ శేఖర్ గౌడ్ చందు మహేందర్ రమేష్ ప్రేమ్, గ్రామంలోనిపెద్దలు,ప్రజాప్రతినిధులు,తల్లిదండ్రులు,యువకులు,విద్యార్థులు,గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు.

# వాజేడు మండలంలో పర్యటించిన మంత్రి సీతక్క.

## గోదావరి శాంతించాలని ప్రత్యేక పూజలు.

**వాజేడు. (నవ జ్యోతి ప్రతినిధి ). ఆగస్టు 01.**

వాజేడు.ములుగు జిల్లాలోని పలు ముంపు ప్రాంతాల గ్రామాలతో పాటు శనివారం వాజేడు మండలంలో పర్యటించారు.ఈ సందర్భంగా గోదావరి వరద శాంతించాలని గోదావరికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) శాంతి పూజలు నిర్వంచారు.అనంతరం గత రెండు రోజుల క్రితం షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధమైన చెన్నం రాజువద్దకు చేరుకొని ఇరువై వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం గతవారం క్రితం వాజేడు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దంతులూరి విశ్వనాథ ప్రసాద్ బాబు రాజు అకాల మరణం చెందిన సంగతి పాఠకులకు తెలిసినదే.. వారి కుటుంబ సభ్యులను కలిసి మంత్రి సీతక్క పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తదనంతరం చీకుపల్లి ఇసుక వాగు పై ముంపును పరిశీలించి తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ యొక్క పర్యటనలో



భాగంగా ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ములుగు జిల్లా ఎస్పీ, సుధీర్ రామ్నాథ్ కేకన్,ఐటిడిఏ పిఓ. లెనిన్ వస్సల్ టోప్పో మరియు మండల అధికారులు నాయకులు ప్రజాప్రతినిధులు

# విద్యార్థులపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది

- **ప్రజాసేవకు ముందు పరిశుభ్రత...జగద్గిరిగుట్ట పోలీసుల సందేశం**
- **ఎస్‌హెచ్‌వో ఎన్. సురేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమం**
- **ఖాకీ చెబుతున్న సందేశం...'శుభ్రతే బాధ్యత'**

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 1: (నవజ్యోతి ప్రతినిధి)**

నేరాల నియంత్రణ, ప్రజల భద్రతతో పాటు పరిశుభ్రమైన కార్యాలయ వాతావరణం కూడా ప్రజా విశ్వాసాన్ని పెంచుతుందనే సందేశంతో జగద్గిరిగుట్ట



పోలీస్ స్టేషన్‌లో శనివారం ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎన్. సురేష్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ కలిసి స్టేషన్‌లోని అన్ని గదులు, క్యాబిన్లు, రికార్డు విభాగాలు, ప్రజలు వేచి ఉండే ప్రదేశాలు, ఆవరణను పూర్తిగా శుభ్రం చేశారు. ఈ సందర్భంగా చెత్త, దుమ్మును తొలగించి స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా మార్చడంతో పాటు పరిశుభ్రత ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టారు. ప్రజలకు సేవలు అందించే ప్రభుత్వ కార్యాలయాలు ఆదర్శవంతంగా ఉండాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌హెచ్‌వో ఎన్. సురేష్ మాట్లాడుతూ, పరిశుభ్రత అనేది కేవలం ఒకరోజు కార్యక్రమం కాదని, ప్రతి ఉద్యోగి తన కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం బాధ్యతగా భావించాలని అన్నారు. శుభ్రమైన వాతావరణం ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని పెంచడమే కాకుండా, ఫిర్యాదుల కోసం వచ్చే ప్రజల్లో విశ్వాసాన్ని కూడా బలోపేతం చేస్తుందన్నారు. పోలీస్ సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని స్టేషన్‌ను పరిశుభ్రంగా తీర్చిదిద్దడం స్థానికుల ప్రశంసలు అందుకుంది. పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని సమాజానికి చేరవేయడంలో ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పోలీసులు పేర్కొన్నారు.

# రాజీవ్ గాంధీ నగర్ బస్తీ లో నూతన రేషన్ దుకాణాన్ని ప్రారంభించిన-ఎమ్మెల్యే మర్రి



**అల్వాల్/ఆగస్టు 1, (నవజ్యోతి ప్రతినిధి):-**

వెంకటాపురం డివిజన్ కానాజీగూడ రాజీవ్ గాంధీ నగర్ బస్తీలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ షాప్ (చౌక ధరల దుకాణం)ను శనివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీనగర్ బస్తీ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా తమ ప్రాంతంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేశారని తెలిపారు.స్థానిక ప్రజల విజ్ఞప్తిని దృష్టిలో ఉంచుకుని సంబంధిత పౌర సరఫరాల శాఖ అధికారులతో నిరంతరం చర్చించి, వారి సహకారంతో ఈ రేషన్ దుకాణాన్ని బస్తీలోనే అందుబాటులోకి తీసుకు రావడం జరిగిందన్నారు.ఇంతకాలం రేషన్ బియ్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని ముఖ్యంగా వృద్ధులు మహిళలు నిరుపేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారని పేర్కొన్నారు.ఇకపై ఆ సమస్యలు తొలగిపోయి బస్తీ ప్రజలకు తమ ప్రాంతంలోనే రేషన్ సరుకులు సులభంగా అందుబాటులో ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు.రాజీవ్ గాంధీ నగర్ బస్తీలో రేషన్ దుకాణం ప్రారంభం కావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్ శ్రీమతి సబితా అనిల్ కిషోర్ గౌడ్,రేషన్ దుకాణం డీలర్ సంజీవరావు,బీఆర్ఎస్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్,శ్రీధర్ గౌడ్,డోలి రమేష్,సయ్యద్ మోసిన్,తాజుద్దీన్, సురేష్,వీరేశం,మహమూద్,దేవేందర్,పవన్,రాజు,ఆశా,శంకర్,ప్రభాకర్,ప్రకాష్ గౌడ్,సుదర్శన్,ముత్యాలు,రాజ్‌కుమార్,కన్నా, సంపత్,స్థానిక బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి 'మాస్టర్ ట్రైనీ'గా డాక్టర్ షేక్ జాన్ పాషా ఎంపిక




- **నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడికి అరుదైన గౌరవం**

**నడిగూడెం: ఆగస్టు 01 (నవజ్యోతి ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2026-27 విద్యా సంవత్సరానికి గానూ ప్రవేశపెట్టిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరపు నూతన పాఠ్యపుస్తకాలపై అధ్యాపకులకు శిక్షణ ఇచ్చేందుకు నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ షేక్ జాన్ పాషా రాష్ట్ర స్థాయి 'మాస్టర్ ట్రైనీ'గా ఎంపికయ్యారు. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డు డైరెక్టర్ నుంచి అధికారిక ఉత్తర్వులు అందాయి.జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన అధ్యాపకులకు వృత్యంతర శిక్షణ ఇచ్చేందుకు హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయం, ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం మరియు కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికలుగా మూడు దశల్లో ఈ శిక్షణా కార్యక్రమాలు జరుగుతున్నాయి. జూలై 31 నుంచి ప్రారంభమైన ఈ శిక్షణలో భాగంగా శుక్రవారం నుంచి అర్థశాస్త్ర అధ్యాపకులకు శిక్షణ ప్రారంభం అయింది,నూతన విద్యా విధానంలో భాగంగా రూపొందించిన పాఠ్యపుస్తకాలపై రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అధ్యాపకులకు నాణ్యమైన శిక్షణ అందించేందుకు డాక్టర్ జాన్ పాషాను ఇంటర్ బోర్డు మాస్టర్ ట్రైనీగా నియమించింది. ఆయన రాష్ట్ర స్థాయి మాస్టర్ ట్రైనీగా ఎంపిక కావడం పట్ల నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# మోడల్ స్కూల్‌లో 153 నూతన అడ్మిషన్లు



**నడిగూడెం: ఆగస్టు 01 (నవజ్యోతి ప్రతినిధి)**

నడిగూడెం మండల పరిధిలోని కరివిరాల తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను నూతనంగా 153 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందనడానికి ఈ అడ్మిషన్ల సంఖ్య నిదర్శనమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల చేరికల పెంపునకు నిరంతరం కృషి చేస్తున్న మండల విద్యాధికారి కి వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులకు, గ్రామ పెద్దలకు మరియు విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.భవిష్యత్తులో కూడా ఇదే విధమైన సహకారం అందిస్తూ కరివిరాల మోడల్ స్కూల్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సర్వాంగీణ వికాసానికి తమ ఉపాధ్యాయ బృందం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

## జూనియర్ కళాశాలలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**నడిగూడెం: ఆగస్టు 01 (నవ జ్యోతి ప్రతినిధి)**



కాంట్రాక్టు వ్యవస్థ ఏర్పడిన 25 సంవత్సరాల చరిత్రలోనే తొలిసారిగా నెలలోని మొదటి రోజే వేతనాలు మంజూరు చేయడం పట్ల ఒప్పంద అధ్యాపకులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా శనివారం నడిగూడెంలోని కేఎల్ఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒప్పంద అధ్యాపకులు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గడచిన పాతికేళ్లలో ఎన్నడూ లేని విధంగా నెల ఆరంభంలోనే జీతాలు జమ కావడంపై అధ్యాపకులు సంతోషం వ్యక్తం చేశారు. ఒప్పంద అధ్యాపకులందరికీ సకాలంలో వేతనాలు అందేలా చర్యలు తీసుకున్నందుకు ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఒప్పంద అధ్యాపకులు నగేష్, ధనుంజయ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించిన- ఎమ్మెల్యే మర్రి



**అల్వాల్/ఆగస్టు 1, (నవజ్యోతి ప్రతినిధి):-**

మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి శనివారం కానాజిగూడ మెయిన్ రోడ్,గ్రీన్ ఫీల్డ్స్ డీమార్ట్ ఎదురుగా ఆల్వాల్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో దుర్గా మహిళా పొదుపు సంఘం నిర్వాహకులు లత,గౌతమి,జయలకు మంజూరైన "ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై క్యాంటీన్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మహిళా పొదుపు సంఘాల సభ్యులు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు ఇటువంటి ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ఎంతో దోహదపడతాయని అన్నారు.మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ,కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడే ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.క్యాంటీన్ నిర్వాహకులు మాట్లాడుతూ ఈ క్యాంటీన్‌లో మిర్చి బజ్జి, పునుగులు,సమోసా,వడ,చపాతీ,టీ తదితర అల్పాహార పదార్థాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్ శ్రీమతి సబితా అనిల్ కిషోర్ గౌడ్,ఆల్వాల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సుధాకర్,కమ్యూనిటీ ఆర్గనైజర్ ప్రవీణ్,బీఆర్ఎస్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్,శ్రీధర్ గౌడ్, డోలి రమేష్,వీరేశం, సయ్యద్ మోసిన్, తాజుద్దీన్,సురేష్, మహమూద్,దేవేందర్, పవన్,రాజు,ఆశా,శంకర్,ప్రభాకర్,ప్రకాష్ గౌడ్, సుదర్శన్, ముత్యాలు, రాజ్‌కుమార్, కన్నా, సంపత్, స్థానిక బస్తీ వాసులు,తదితరులు పాల్గొన్నారు.

## బోనాల ఏర్పాట్లలో వేగం..

- **కుషాయిగూడలో ఎమ్మెల్యే ఆదేశాలతో ముమ్మర పనులు**
- **భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు.. పోచమ్మ ఆలయం నుంచి శివసాయి నగర్ వరకు మట్టి పనులు**



**కుషాయిగూడ, ఆగస్టు 01,(నవజ్యోతి ప్రతినిధి) :**

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు కుషాయిగూడలో బోనాల మహోత్సవాల ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. శనివారం పోచమ్మ దేవాలయం పరిసరాల్లో భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న పనులను స్థానిక నాయకులు, అధికారులు పరిశీలించారు. ఆషాఢ మాసం బోనాల సందర్భంగా వేలాది మంది భక్తులు కుషాయిగూడకు తరలివస్తుండటంతో, కాప్రా సర్కిల్ ఇంజినీరింగ్ అధికారులు బాక్స్ డ్రైన్ ఇరువైపులా పోచమ్మ దేవాలయం నుంచి డి-మార్ట్ సమీపంలోని శివసాయి నగర్ వరకు మట్టి పోసి రహదారిని చదును చేస్తున్నారు.బాక్స్ డ్రైన్ నిర్మాణ పనుల కారణంగా స్థానికులు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులకు సూచించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కంటెస్టెంట్ కార్పొరేటర్ నేమూరి మహేష్ గౌడ్,బిఆర్ఎస్ నాయకులు పాండాల శివకుమార్ గౌడ్,కాలనీ కమిటీల సమాఖ్య (సీసీఎస్) అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి,చల్ల వెంకటేష్, బాలాజీ నాయక్, శ్రీశైలం, మల్లేష్, శ్రీనివాస్ నాయక్, శేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పరివాహక ప్రజలకి శాశ్వత రక్షణ కల్పిస్తాం

- **లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం.**
- **రాష్ట్ర మంత్రి శ్రీమతి దనసరి అనసూయ (సీతక్క).**



**వాజేడు (నవజ్యోతి. ప్రతినిధి). ఆగష్టు01**

. ఏటూరు నాగారం.

ములుగు జిల్లాలోనీ గోదావరి వరదకు నీట మునిగిన పలు మండలాలకు చెందిన గ్రామాలలో శనివారం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి,స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మరియు ములుగు జిల్లా కలెక్టర్, ములుగు జిల్లా SP, మరియు ఐ.టి.డి.ఏ. పి ఓ, పర్యటించారు. మొదటిగా ఏటూరు నాగారం మండలం లోని రామన్నగూడెం గోదావరి పుష్కర ఘాట్ వద్దకు వెళ్ళి గోదావరి ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ గత రెండు రోజులుగా ఛత్తీస్గఢ్, మహారాష్ట్ర లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భారీ వరదలు వస్తున్నాయని, దీనిగురించి జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తమై పని చేస్తుందని తెలిపారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని అన్నారు. గత రెండేళ్లుగా ప్రత్యేక వరద నిర్మూలన కమిటీ వేసి వాగులు, గోదావరి పరివాహక ప్రాంతాలలో, ముంపు గ్రామాల్లో ప్రత్యేక అధికారులను నియమించి పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తున్నామని తెలిపారు. గోదావరి మూడో ప్రమాద హెచ్చరిక చేరినప్పటికీ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం వలన ఎటువంటి నష్టం జరగలేదని తెలిపారు. రెండు నెలల క్రితమే గోదావరి పరివాహక ప్రాంతాలలో ఉన్నత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పర్యటించి అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నామని అన్నారు. గతంలో రామన్నగూడెం లోకి వరద నీరు చేరేదని ఈసారి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం వలన వరద ను నివారించగలిగామని పేర్కొన్నారు. రామన్నగూడెం, మంగపేట ప్రాంతాలలో ఇప్పటికే కరకట్ట పనులు ప్రారంభం అయ్యాయని, సుమారు 800మీటర్ల మేర కరకట్ట పనులు పూర్తి అయ్యాయని వివరించారు. ప్రజలు వాగులు, వరదలు ఉప్పొంగిన సమయంలో దాటే ప్రయత్నం చేయకూడదని విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాలు కురిసే సమయంలో చేపల వేటకు వెళ్ళడం కానీ,అడవుల్లోకి పశువుల కాపర్లు పశువులను మేత కి తీసుకువెళ్లడం ప్రమాదకరమని హెచ్చరించారు. 2022,2023, సంవత్సరాలలో గోదావరి, జంపన్న వాగు వరదల వల్ల కలిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని మిగిలిన కరకట్ట పనులు కూడా పూర్తి చేసి గోదావరి పరివాహక ప్రజలకి శాశ్వత రక్షణ కల్పిస్తామని తెలిపారు. అదేవిధంగా లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకి పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. ఈయొక్క పర్యటనలో భాగంగా ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ్ రావు, ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐ.టి.డి.ఏ.పి.ఓ.లెనిన్ వస్సల్ టోప్పో మరియు స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచి, పౌష్టికాహారం అందించాలి

- **నడిగూడెం మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేసిన మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**

**నడిగూడెం, ఆగస్టు 01 ( నవజ్యోతి ప్రతినిధి)**

ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన పౌష్టికాహారం అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు.శనివారం నడిగూడెం మండలం కరివిరాల గ్రామంలోని మోడల్ స్కూల్, హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం, హాస్టల్ వసతి, తాగునీరు, పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లు మరియు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కింద కూర్చొని భోజనం చేసి, వారికి అందిస్తున్న ఆహార నాణ్యతను స్వయంగా పరీక్షించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు, కొన్ని చోట్ల విద్యార్థులకు పురుగులు ఉన్న, నాసిరకం భోజనం అందించడం వల్ల చిన్నారులు వాంతులు, విరోచనాల బారిన పడటం అత్యంత బాధాకరమన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఎక్కువగా అట్టడుగు, పేద వర్గాల పిల్లలే చదువుకుంటారని, వారి ఆరోగ్యంతో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా విద్యాశాఖను పర్యవేక్షిస్తున్నప్పటికీ, విద్యా రంగానికి బడ్జెట్‌లో చాలీచాలని నిధులు కేటాయించడం వల్లే ఈ దుస్థితి దాపురించిందని విమర్శించారు.



కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తామని చెప్పి, కనీస సదుపాయాలు కూడా కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇటీవల రెసిడెన్షియల్ పాఠశాలల్లో జరిగిన వరుస విషాద ఘటనలు, విద్యార్థుల అనారోగ్య సమస్యల కారణంగా తమ పిల్లలు క్షేమంగా తిరిగి వస్తారో లేదో అని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్‌తో పాటు విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, కరివిరాల మోడల్ స్కూల్‌తో పాటు కోదాడ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు బడ్జెట్ పెంచి, పరిశుభ్రమైన వాతావరణంలో మెరుగైన విద్యను అందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని బొల్లం మల్లయ్య యాదవ్ కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, స్థానిక నాయకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రపంచ తల్లి పాల దినోత్సవాలు ఘనం గా నిర్వహణ

**మేడ్చల్ ఆగష్టు 01(నవజ్యోతి ప్రతినిధి )**

మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఘన్ పూర్, మేడ్చల్ లో ప్రపంచ తల్లి పాల దినోత్సవాలు ఘనం గా ప్రారంభమయ్యాయి . సుసేన హెల్త్ ఫౌండేషన్ మరియు మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వారి సంయుక్త ఆధ్వర్యం లో నేటి నుండి వారం రోజుల పాటూ ఈ నెల 7 తేదీ వరకు ప్రపంచ తల్లి పాల దినోత్సవాలు నిర్వహించనున్నారు. నేటి ఉదయం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో లో ప్రొఫెసర్ కె శివరామకృష్ణ, ప్రెసిడెంట్, షేర్ మెడికల్ కేర్ ఫౌండేషన్ వారు సుసేన హెల్త్ ఫౌండేషన్ ప్రతినిధులతో కలసి సాంప్రదాయ జ్యోతి ప్రజ్వళన తో వారోత్సవాలను ప్రారంభించారు. ముందుగా డా. కల్పన, హెడ్, గైనకాలజీ విభాగం, మెడిసిటి ఇన్స్టిట్యూట్ వారు మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాల ప్రాధాన్యతను వివరించారు. తదుపరి ప్రసవం తరువాత వచ్చే పసుపురంగు పాలు బిడ్డకు తొలి టీకా గా అభివర్ణిస్తారని వివరిస్తూ ఇందులో ఉండే అనేక రోగనిరోధక పదార్థాలు శిశువును అనేక అంటువ్యాధులనుంచి రక్షిస్తాయని తెలిపారు. తల్లి ప్రాధాన్యతను గమనించిన ప్రభుత్వాలు తల్లి శిశువుకు కేవలం ఇంట్లో ఉన్నప్పుడు మాత్రమే కాకుండా బయట షాపింగ్ కు వెళినపుడు పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ లోను, ప్రయాణించే సమయాలలో రైల్వే స్టేషన్స్ లు మరియు విమానాశ్రయాల్లోను ప్రత్యేక ఏర్పాటు



చేశారని వాటిని తల్లులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కె శివరామకృష్ణ, ప్రెసిడెంట్, షేర్ మెడికల్ కేర్ ఫౌండేషన్ వారు మాట్లాడుతూ తల్లి పాలు ప్రతి శిశువుకు ప్రకృతి ప్రసాదించిన వరమని అంటూ శిశువుకు అత్యుత్తమ ఆహారమన్నారు. శిశువు మానసిక ఎదుగుదల మొదలు వికాసానికి అవసరమైన అన్ని పోషకాలు తల్లి పాలలో ఉన్నాయని వివరించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ మరియు యూనిసెఫ్ లు శిశువు జన్మించిన మొదటి గంటలోనే తల్లి పాలు ప్రారంభించాలని తదుపరి ఆరునెలలు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని సూచిస్తున్నాయన్నారు. త్వరలోనే మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో మిల్క్ బ్యాంకు ఏర్పాటు ను పరిశీలిస్తున్నామని వెల్లడించారు. అనంతరం సుశేన హెల్త్ కేర్ ఫౌండేషన్ ప్రతినిధులైన డా. సంతోష్ కుమార్ క్రాలేటి, డా దుర్గా భవాని కాల్వపల్లి, డా. యాదయ్య దామెర్ల తదితరులు బ్రెస్ట్ ఫీడింగ్ పై ప్రత్యేక వర్క్ షాపు నిర్వహించారు. ఈ వర్క్ షాపులో బ్రెస్ట్ ఫీడింగ్ ప్రాధాన్యత, బ్రెస్ట్ ఫీడింగ్ చేయడం వలన తల్లి మరియు శిశువులో ఏర్పడే మానసిక, శారీరక మార్పులు మరియు ప్రయోజనాలతో పాటూ బ్రెస్ట్ ఫీడింగ్ ను ప్రోత్సహించడంలో గైనకాలజీ వైద్యుల పాత్రపై చర్చించారు. అనంతరం సుశేన హెల్త్ ఫౌండేషన్ ప్రతినిధులు తమ సంస్థ ద్వారా జరుపుతున్న పలు సేవా కార్యక్రమాలను సభికులకు వివరించారు. తర్వాత బ్రెస్ట్ ఫీడింగ్ వారోత్సవాలను పురస్కరించుకొని సుశేన ఫౌండేషన్ ప్రతినిధులు యం బి బి యస్ చదువుతున్న విద్యార్థి, విద్యార్థిణులకు తల్లి పాలపై ప్రత్యేక క్విజ్ ప్రోగ్రాం నిర్వహించారు. అంతే గాకుండా సీనియర్ వైద్య బృందం వారు విద్యార్థులకు దీనిపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేసి అవగాహన కలిపించారు. అంతకు ముందు కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శపథ ఫలకం పై పలువురు వైద్యులు, విద్యార్థులు తల్లిపాలను అందిస్తామని సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కె శివరామకృష్ణ, ప్రెసిడంటే, షేర్ మెడికల్ కేర్ ఫౌండేషన్ వారు సుశేన హెల్త్ ఫౌండేషన్ ప్రతినిధులకు ప్రత్యేక జ్ఞాపికలు అందించారు. దీంతో పాటూ ఈ వారోత్సవాల ప్రాధాన్యతను ప్రతిబంబిస్తూ కళాశాలకు చెందిన విద్యార్థిణులు వేసిన రంగోళులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ వారోత్సవాలలో భాగంగా రానున్న వారం రోజుల పాటూ మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఈ కార్యక్రమాలలో ప్రొఫెసర్ కె శివరామకృష్ణ, ప్రెసిడెంట్, షేర్ మెడికల్ కేర్ ఫౌండేషన్ వారితో పాటూ డా దేవేంద్ర సింగ్ నేగి, ప్రిన్సిపాల్, మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ – డా. డి శైలేంద్ర, వైస్ ప్రిన్సిపాల్, మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ – డా. గీత, మెడికల్ డైరెక్టర్, మెడిసిటి హాస్పిటల్, ఘన్ పూర్ – డా. కల్పన, ప్రొపెసర్ అండ్ హెడ్, గైనకాలజీ విభాగం, మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ – డా. సి సుదర్శన రాజు, ప్రొఫెసర్ అండ్ హెడ్, చిన్న పిల్లల వైద్య విభాగం తో పాటూ సుశేన హెల్త్ కేర్ ఫౌండేషన్ ప్రతినిధులు డా. సంతోష్ కుమార్ క్రాలేటి, డా దుర్గా భవాని కాల్వపల్లి, డా. యాదయ్య దామెర్ల తదితరులతో పాటూ కాలేజీ కి చెందిన వైద్య అధ్యాపకులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అడ్డగుట్టలో ఆక్రమణల తొలగింపు.. రహదారులకు ఊపిరి

**కూకట్‌పల్లి, ఆగస్టు 1, ( నవజ్యోతి ప్రతినిధి):**

ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలోని అడ్డగుట్ట ప్రాంతంలో అధికారులు ఆక్రమణల తొలగింపు డ్రైవ్ చేపట్టారు. కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పక్కనుంచి శంకర్ విలాస్ వరకు ఉన్న ప్రధాన రహదారి పరిసరాల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను, ఆక్రమణలను అధికారులు బుల్డోజర్లతో తొలగించారు. ప్రజలకు, వాహనదారులకు రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకే ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. రహదారులను ఆక్రమణల రహితంగా ఉంచడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ అక్రమ ఆక్రమణలపై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార కార్యక్రమానికి శ్రీకారం...

- నక్కలపల్లిలో సర్పంచ్ మంగళారం యాదయ్య చేతుల మీదుగా ప్రారంభం.

**ఉమ్మడి రంగారెడ్డి/ మొయినాబాద్, ఆగస్టు 01, (నవజ్యోతి ప్రతినిధి శివారెడ్డి) :**



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణతో పాటు వారి విద్యాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఉచిత అల్పాహార కార్యక్రమాన్ని శనివారం నక్కలపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో గ్రామపంచాయతీ సర్పంచ్ మంగళారం యాదయ్య అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అల్పాహారం వడ్డించి, వారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ మంగళారం యాదయ్య మాట్లాడుతూ చిన్నారులు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణించ గలరని, విద్యార్థులకు సమతుల్యమైన పోషకాహారం అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థి ఉదయం పాఠశాలకు వచ్చిన వెంటనే పోషకాహారంతో కూడిన అల్పాహారం పొందడం వల్ల ఆకలి సమస్య తగ్గి, తరగతి గదిలో ఏకాగ్రత పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పోషకాహార లోపం తగ్గడంతో పాటు విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అల్పాహార కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఉపాధ్యాయులు, వంట సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గ్రామపంచాయతీ తరపున అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంగ, గ్రామ ఉపసర్పంచ్ గౌడ్ల నిరంజన్ గౌడ్, పాఠశాల నిర్వహణ కమిటీ చైర్‌పర్సన్ వరలక్ష్మి , పంచాయతీ కార్యదర్శి యాదగిరి, వార్డు సభ్యుడు మంగళారం రవీందర్, నాయకులు భాను గౌడ్, నవీన్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గణితంలో పీహెచ్‌డీ సాధించిన డాక్టర్ డి. హారిత

**పటాన్చెరు,ఆగస్ట్ 01(నవజ్యోతి ప్రతినిది):**

పటాన్చెరు నియోజకవర్గంలో ముత్తంగిలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ , కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. హారిత గణితశాస్త్రంలో ప్రతిష్టాత్మక డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పట్టా సాధించి విద్యా రంగంలో మరో మైలురాయిని నెలకొల్పారు. "ఎ ఫిక్స్‌డ్ పాయింట్ థియరీ ఇన్ జనరలైజ్డ్ మెట్రిక్ స్పేసెస్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్" అనే అంశంపై ఆమె విజయవంతంగా పరిశోధన పూర్తి చేశారు. గణిత విశ్లేషణ ఫిక్స్‌డ్ పాయింట్ థియరీ రంగాల్లో ఈ పరిశోధన విశిష్టమైనదిగా గుర్తింపు పొందింది. గణితశాస్త్రంలోని పలు విభాగాలతో పాటు అనుబంధ శాస్త్రాల్లోనూ ఈ పరిశోధనకు విస్తృత అనువర్తనాలు ఉన్నాయని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. పీహెచ్‌డీ పట్టా సాధించిన సందర్భంగా డాక్టర్ హారిత తన విద్యా ప్రయాణంలో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పరిశోధన మార్గదర్శకులు డాక్టర్ రామ కోటేశ్వరరావు, డాక్టర్ కృష్ణకుమారి అందించిన మార్గనిర్దేశం, ప్రోత్సాహం, సహకారం తన విజయానికి ఎంతో దోహదపడిందని చెప్పారు. అలాగే ఉపాధ్యాయులు, సహచరులు, స్నేహితులు, విద్యార్థులు, శ్రేయోభిలాషుల ప్రోత్సాహాన్ని ఆమె స్మరించుకున్నారు. ఈ విజయాన్ని తన భర్త బాలనాదంకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. తండ్రి చిన్న నర్సింహులు, తల్లి కంసమ్మ ఆశీస్సులు, కుటుంబ సభ్యుల ప్రేమ, ప్రోత్సాహం, ప్రార్థనల వల్లే ఈ విజయాన్ని సాధించగలిగానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హారిత మాట్లాడుతూ, "ఈ పీహెచ్‌డీ కేవలం నా వ్యక్తిగత విజయం మాత్రమే కాదు. నా కుటుంబం, గురువులు, పరిశోధన మార్గదర్శకులు,



సహచరులు, విద్యార్థులు, నా ప్రయాణంలో నాతో నిలిచిన ప్రతి ఒక్కరి విజయం. విద్య సమాజాన్ని మార్చగల అత్యంత శక్తివంతమైన సాధనం. నాణ్యమైన విద్య, పరిశోధన ద్వారా యువతను తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తాను" అని అన్నారు. డాక్టర్ హారిత సాధించిన ఈ ఘనత విద్యార్థులకు, ముఖ్యంగా యువతులకు ఉన్నత విద్య, పరిశోధన, విద్యా రంగంలో రాణించేందుకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పలువురు విద్యావేత్తలు, సహచరులు, శ్రేయోభి లాషులు అభినందనలు తెలిపారు.

# 18 ఏళ్లుగా పూర్తికాని ఘట్‌కేసర్ ఆర్ఓబీపై బీజేపీ ఆందోళన

- రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్

**ఘట్‌కేసర్,ఆగస్టు 01,(నవజ్యోతి ప్రతినిధి):**




ఘట్‌కేసర్‌లో గత 18 సంవత్సరాలుగా పూర్తి కాకుండా ఉన్న రైల్వే ఓవర్‌బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, ప్రజలు ప్రతిరోజూ తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గత 18 ఏళ్లలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పటికీ ఆర్ఓబీ నిర్మాణం పూర్తి చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ఇకపై కూడా పనులు వేగవంతం చేయకపోతే ప్రజలతో కలిసి భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి,జిల్లా అధ్యక్షుడు బుద్ధి శీనన్న,విక్రం రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి గోనె శ్రీనివాస్,జిల్లా కన్వీనర్,జిల్లా కార్యాలయ కార్యదర్శి,ఎం సి పల్లి బిజెపి మున్సిపల్ ఇంచార్జ్ గాలి సంపత్ యాదవ్, నాగారం మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్ర రెడ్డి,మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్,కీసర డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కోలా బాలరాజ్ యాదవ్, నక్క కిషోర్ గౌడ్,మెరుగు శ్రీనివాస్ రెడ్డి,జిల్లా, మండల,మున్సిపల్ నాయకులు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాలాజీ ఎన్‌క్లేవ్ అభివృద్ధికి ఎమ్మెల్యే హామీ

- కాలనీ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ వినతి

**ఉప్పల్ ,ఆగస్టు 01,(నవజ్యోతి ప్రతినిధి) :**



ఉప్పల్ జోన్ బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని బాలాజీ ఎన్‌క్లేవ్ కాలనీ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కాలనీలో దెబ్బతిన్న సీసీ రహదారుల నిర్మాణం, వర్షపు నీటి కాలువల ఏర్పాటు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, త్రీఫేజ్ విద్యుత్ సరఫరా, ప్రధాన రహదారుల వెంట ఫుట్‌పాత్‌లపై మొక్కల పెంపకం వంటి అభివృద్ధి పనులను చేపట్టాలని కోరారు. వినతిపై స్పందించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వెంటనే ఎంఎంసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే కాలనీ అభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బాలాజీ ఎన్‌క్లేవ్ కాలనీ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి ఓంకార్ సింగ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు శంకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# బండమాదారంలో రూ.16 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

**మేడ్చల్ , ఆగస్టు 1( నవజ్యోతి ప్రతినిధి)**



ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు బండమాదారం గ్రామంలో సుమారు రూ.16 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శనివారం ఘనంగా శంకుస్థాపన జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి లావుడ్యా శ్రీదేవి రమేష్ కొబ్బరికాయ కొట్టి ఈ పనులను ప్రారంభించారు. గ్రామంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న మురుగునీటి సమస్యకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ద్వారా శాశ్వత పరిష్కారం చూపించనున్నారు. పారిశుద్ధ్య మెరుగుదల ఈ పనులు పూర్తయితే పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడి, వర్షాకాలంలో నీటి నిల్వలు మరియు దుర్వాసన వంటి ఇబ్బందులు తొలగిపోతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ప్రతి వార్డులోనూ అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే తమ పాలకవర్గ ప్రధాన లక్ష్యమని చైర్‌పర్సన్ తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని అభివృద్ధి పనుల ద్వారా నిలబెట్టుకుంటామని వైస్ చైర్‌పర్సన్ మేకల రజిత దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. చేపట్టిన పనులను ఎటువంటి లోపాలకు తావు లేకుండా నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు మాలోత్ రజిత రాజేందర్, నీరుగంటి శ్రీలత రమేష్, దాది నారసింహ, వీర్లపల్లి ఓం ప్రకాష్, కత్తి వరలక్ష్మి సురేందర్, చిన్నోళ్ల భాస్కర్, వాచాపల్లి అర్చన శ్రీనివాస్, వార్డ్ ఆఫీసర్ పద్మ, మున్సిపల్ సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆగష్టు 1 నుంచి పోలీస్ యాక్ట్ అమలు...

- ధర్నాలు.. రాస్తారోకోలకు ముందస్తు అనుమతి తప్పనిసరి
- ప్రజా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం చేస్తే కఠిన చర్యలు....
- తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్....

**తూప్రాన్, 01 ఆగష్టు ( నవజ్యోతి ప్రతినిధి నవీన్ ) :**



మెదక్ జిల్లా శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా ఆగష్టు 01 నుండి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ – 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు అని తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ అన్నారు, పోలీస్ యాక్ట్ అమలులో ఉన్న సమయంలో పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఏవిధమైన ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని తూప్రాన్ డీఎస్పీ తెలిపారు. అలాగే ప్రజల/ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్టవ్యతిరేక చర్యలు, అశాంతి సృష్టించే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. శాంతి భద్రతల నిర్వహణలో ఎవరైనా విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసులు చేపడుతున్న చర్యలకు ప్రతి ఒక్కరు సహకరించాలని తూప్రాన్ డివిజన్ ప్రజలకు నాయకులకు తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

# గ్రామ సమస్యలపై క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలతో మమేకం :

- సర్పంచ్ ఉమా సంజీవ రెడ్డి.
- ఆర్.వెంకటాపూర్ లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన
- గ్రామాభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం: సర్పంచ్ ఉమా సంజీవరెడ్డి
- డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సమస్యల పరిష్కారానికి హామీ

**రామాయంపేట, ఆగస్టు 1 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :**



గ్రామసమగ్ర అభివృద్ధి,మహిళా సాధికారత, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఆర్.వెంకటాపూర్ గ్రామంలో శనివారం గ్రామ సర్పంచ్ వెంకుగారి ఉమా సంజీవరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామస్థులు, మహిళా సంఘాల సభ్యులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల పొదుపు, పేదరిక నిర్మూలన, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, కుటీర పరిశ్రమల ప్రోత్సాహం, తడి–పొడి చెత్త వేర్వేరుగా సేకరణ, పరిశుభ్రత, కలుషిత నీటి నివారణ, కుటుంబ సంక్షేమం, ఆర్థిక స్వావలంబన, మహిళల హక్కులు, గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో సహకరించాలని సర్పంచ్ సూచించారు.అనంతరం సర్పంచ్ ఉమా సంజీవరెడ్డి గ్రామంలోని పలు వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.డ్రైనేజీల నిర్వహణ, సీసీ రోడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యాలు, పారిశుధ్య సమస్యలపై వివరాలు సేకరించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.గ్రామ ప్రజల సహకారంతో ఆర్.వెంకటాపూర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని సర్పంచ్ ఉమా సంజీవరెడ్డి తెలిపారు.

# ధర్మారెడ్డి కాలనీలో దెబ్బతిన్న రోడ్డు..

## మరమ్మతులు చేపట్టాలని స్థానికుల డిమాండ్

**కూకట్ పల్లి, ఆగస్టు 1, ( నవజ్యోతి ప్రతినిధి):**

కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని ధర్మారెడ్డి కాలనీ ఫేజ్–1, ఎంఐజీ–64 ప్రాంతంలో రోడ్డు తీవ్రంగా దెబ్బతిని స్థానికులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రహదారిపై పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు, పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సిఎంసి అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుకు ప్యాచ్ వర్క్ చేపట్టి మరమ్మతులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. రాబోయే వర్షాలకు రోడ్డు మరింత దెబ్బతినే ప్రమాదం ఉన్నందున అధికారులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# 138 ఆలయ కమిటీలకు బోనాల నిధుల చెక్కుల పంపిణీ



**కూకట్పల్లి, ఆగస్టు 1, ( నవజ్యోతి ప్రతినిధి):**

బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ తెలిపారు. భరత్ నగర్ శ్రీ హరిహర క్షేత్రం ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని 138 ఆలయ కమిటీల అధ్యక్షులకు ప్రభుత్వ ఆర్థిక సహాయ నిధుల చెక్కులను అందజేశారు.రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తోందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పారెడ్డి, నాయకులు నాగిరెడ్డి, తూము వేణు, మస్తాన్ రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చైతన్య విశ్వవిద్యాలయం అంతర్జాతీయ ఫోరెన్సిక్ శిక్షణను నిర్వహించింది...

**హైదరాబాద్, ఆగస్టు 01, (నవజ్యోతి ప్రతినిధి శివారెడ్డి) :**




హైదరాబాద్‌లోని చైతన్య (డీమ్డ్ టు బి యూనివర్సిటీ) ఫోరెన్సిక్ సైన్స్ విభాగం, ఇథియోపియాలోని అడమాలో ఉన్న ఒరోమియా పోలీస్ కళాశాల సహకారంతో, "పోలీసు అధికారుల కోసం ఫోరెన్సిక్ దర్యాప్తు పద్ధతులు" అనే అంశంపై 12 రోజుల అంతర్జాతీయ వృత్తిపర శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. శాస్త్రీయ దర్యాప్తు నైపుణ్యాలను బలోపేతం చేయడం, వృత్తిపరమైన పోలీసింగ్ పద్ధతులను మెరుగుపరచడం, మరియు ఫోరెన్సిక్ సైన్స్‌లో అంతర్జాతీయ విద్యా సహకారాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. చైతన్య (డీమ్డ్ టు బి యూనివర్సిటీ) వ్యవస్థాపకులు మరియు ఛాన్సలర్ డా. సిహెచ్. వి. పురుషోత్తం రెడ్డి, ముఖ్య పరిపాలనా అధికారి డా. సిహెచ్. సాత్విక రెడ్డి, ఒరోమియా పోలీస్ కళాశాల అసిస్టెంట్ కమిషనర్ మరియు జనరల్ డైరెక్టర్ గోసయే కెబెడెల నేతృత్వంలో ఈ కార్యక్రమం ప్రారంభించబడింది. ప్రత్యేకంగా పోలీసు అధికారుల కోసం రూపొందించబడిన ఈ శిక్షణ, ఆధునిక నేర దర్యాప్తు సవాళ్లను ఎదుర్కోవడానికి సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని ఆచరణాత్మక దర్యాప్తు పద్ధతులతో మిళితం చేసింది. పాల్గొన్నవారు. క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్, ఆధునిక నేర పరిశోధన, అనుమానాస్పద పత్రాల పరిశీలన, వేలిముద్రల గుర్తింపు, మొబైల్ మరియు డిజిటల్ ఫోరెన్సిక్స్, ఫోరెన్సిక్ కెమిస్ట్రీ, జి.సి- ఎం.ఎస్/ఎం.ఎస్ అప్లికేషన్స్, యు.వి-విజిబుల్ స్పెక్ట్రోఫోటోమెట్రీ, ఎఫ్.టి.ఐ.ఆర్ స్పెక్ట్రోస్కోపీ, ఫోరెన్సిక్ బాలిస్టిక్స్, పేలుడు పదార్థాల గుర్తింపు, పేలుడు అనంతర దర్యాప్తు, అధునాతన ఫోరెన్సిక్ ఫోటోగ్రఫీ, ఫోరెన్సిక్ లైట్ సోర్స్ టెక్నాలజీ, ఫోరెన్సిక్ సైన్స్‌లో నానోటెక్నాలజీ, నేర ప్రవర్తన విశ్లేషణ వంటి అనేక రకాల ఫోరెన్సిక్ విభాగాలలో ప్రత్యక్ష శిక్షణ పొందారు. ఫోరెన్సిక్ సైన్స్ విభాగానికి చెందిన ధరావత్ అశోక్, బి. శివ ప్రసాద్, పి. ఎస్. పద్మ ప్రణవి, రేవతి సుందర మూర్తి, వంటి నిపుణులైన అధ్యాపకులు ఈ శిక్షణా తరగతులను నిర్వహించారు. వీరు సమకాలీన ఫోరెన్సిక్ పద్ధతులు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలలో తమ నైపుణ్యాన్ని పంచుకున్నారు. ఫోరెన్సిక్ సైన్స్‌లో విద్యాపరమైన శ్రేష్ఠత, అంతర్జాతీయ సహకారం, సామర్థ్య నిర్మాణాన్ని ప్రోత్సహించాలనే చైతన్య (డీమ్డ్ టు బి యూనివర్సిటీ) యొక్క నిరంతర నిబద్ధతలో ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తి కావడం మరో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది.

## తల్లిపాల ప్రాముఖ్యత పై అవగాహన

### ఐసిడిఎస్ సూపర్వైజర్ సంతోష

**శివ్వంపేట, ఆగస్టు 01 ( నవ జ్యోతి ప్రతి నిధి ఆకుల శ్రీనివాస్ ) :**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రమైన అంగన్వాడి కేంద్రంలో శనివారం నాడు సెక్టారు సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా సూపర్వైజర్ సంతోష పాల్గొని ప్రతి గ్రామాలలో ఆగస్టు 1వ తారీఖు నుండి 7వ తారీకు వరకు తల్లిపాల వారోత్సవాలను ప్రతి గ్రామంలో నిర్వహించాలని తెలియపరచడం జరిగింది. అన్ని గ్రామాలలో తల్లిపాల గురించి అవగాహన కల్పించాలని తెలపడం జరిగినది. ఈ కార్యక్రమంలో సెక్టార్ పరిధిలోని అందరూ అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## ఎల్లంపేట మున్సిపాలిటీ రాజబొల్లారంలో అధికారుల అండదండలతో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు!

**మేడ్చల్,ఆగష్టు 01( నవ జ్యోతి ప్రతినిధి )**

ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని రాజబొల్లారం ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అనధికారిక కట్టడాలు జోరుగా సాగుతున్నాయి. అధికారుల అండదండలు, మౌన ఆమోదంతోనే ఇక్కడ భారీ ఎత్తున అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను, మున్సిపల్ చట్టాలను తుంగలో తొక్కి నిర్మిస్తున్న ఈ అక్రమ కట్టడాలకు బాధ్యులు ఎవరనే ప్రశ్న స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

**అధికారుల ఉదాసీనతకు నిలువెత్తు నిదర్శనం!**

ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు పాతర వేస్తూ చేపట్టిన ఈ నిర్మాణాలు అధికారుల పర్యవేక్షణ లోపాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. కండ్ల ముందే అక్రమ నిర్మాణాలు పుట్టుకొస్తున్నప్పటికీ, సంబంధిత మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలను గాలికొదిలేసి చేపడుతున్న ఈ నిర్మాణాలు సక్రమమేనా? అని స్థానిక ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్అ ధికారుల అండతోనే ఇష్టానుసారంగా వెలుస్తున్న ఈ అక్రమ కట్టడాలపై పైస్థాయి అధికారులు తక్షణమే స్పందించి, సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఈ అనధికార నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుని, బాధ్యులైన వారిపై మరియు అక్రమాలకు మద్దతు ఇస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో ఏఈఆర్ వో పరిశీలన

**కూకట్ పల్లి, ఆగస్టు 1, (నవజ్యోతి ప్రతినిధి):**

శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 ఏఈఆర్‌వో, డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి బీఎల్‌వో సూపర్వైజర్‌తో కలిసి అల్లాపూర్ సొసైటీలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. 478 నుంచి 485 వరకు ఉన్న పోలింగ్ స్టేషన్లను సందర్శించిన అధికారులు, నియోజకవర్గా పరిధిలోని ఓటర్ల జాబితా మ్యాపింగ్‌తో పాటు ఈఎఫ్ ఫారాల సేకరణ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు.హైదర్‌నగర్ వార్డు 243 పరిధిలో ఓటర్లతో నేరుగా మాట్లాడి మ్యాపింగ్ ప్రక్రియపై ఉన్న అనుమానాలను నివృత్తి చేశారు. ఈఎఫ్ ఫారాల సేకరణ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించేలా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

# ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నక్కలపల్లిలో అవగాహన కార్యక్రమం...

- **తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ కవచం – సర్పంచ్ మంగలారం యాదయ్య.**

**ఉమ్మడి రంగారెడ్డి, ఆగస్టు 01, (నవజ్యోతి ప్రతినిధి శివారెడ్డి) :**



ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నక్కలపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అంగన్‌వాడీ టీచర్ కాంతమ్మ ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మంగలారం యాదయ్య, ఉప సర్పంచ్ నిరంజన్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొని గర్భిణీలు, బాలింతలు మరియు గ్రామ మహిళలకు తల్లిపాల విశిష్టతను వివరించారు. సర్పంచ్ మంగలారం యాదయ్య మాట్లాడుతూ, తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వరమని అన్నారు. శిశువు జన్మించిన వెంటనే వచ్చే ముర్రుపాలు (కొలస్ట్రం) తప్పనిసరిగా పట్టించాలని, అవే శిశువుకు తొలి రోగనిరోధక శక్తిని అందించే సహజ రక్షణ కవచమని పేర్కొన్నారు. తల్లిపాలు శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతగానో దోహదపడతాయని, పుట్టిన ప్రతి బిడ్డకు తొలి ఆరు నెలల పాటు ఎలాంటి ఇతర ఆహారం లేదా నీరు ఇవ్వకుండా కేవలం తల్లిపాలనే అందించాలని సూచించారు. ఉప సర్పంచ్ నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ తల్లిపాల ద్వారా శిశువుకు అవసరమైన సంపూర్ణ పోషకాలు లభిస్తాయని, తల్లి-బిడ్డల మధ్య అనుబంధం మరింత బలపడుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ టీచర్ కాంతమ్మ తల్లిపాల ప్రాముఖ్యత, గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రసవానంతరం తల్లి ఆరోగ్య సంరక్షణ, శిశు పోషణ వంటి అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణీలు, బాలింతలు సందేహాలను నివృత్తి చేసుకుని తల్లిపాలపై విలువైన సూచనలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంగలారం యాదయ్య, ఉప సర్పంచ్ నిరంజన్ గౌడ్, వార్డు సభ్యురాలు తేజశ్రీ, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, డ్వాక్రా సంఘం అధ్యక్షురాలు వరలక్ష్మి , వివోఏ శిరీష, అంగన్‌వాడీ టీచర్ కాంతమ్మ, అంగన్‌వాడీ ఆయా అనసూయ, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, గ్రామ మహిళలు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ రహదారి ఆక్రమిస్తున్న నిర్మాణదారులకు సహకరిస్తున్న విద్యుత్ శాఖ..!







- **ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు సాకుతో రోడ్డు ఆక్రమణ..**
- **నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు**
- **తప్పిదం జరిగితే చర్యలు తప్పవని స్పష్టం:ఏడీఈ రమేష్**

**రాజేంద్రనగర్ ఆగస్టు 01(. నవ జ్యోతి ప్రతినిధి .)**

శంషాబాద్ మండలంలోని సాతంరాయి ప్రధాన రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది. వివరాల్లోకి వెళితే శంషాబాద్ – బెంగళూరు జాతీయ రహదారి వెంట కొన్ని ప్రైవేట్ భవనాలకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భవనాల సమీపంలో కాకుండా రోడ్డు ఆక్రమించి ట్రాన్స్ఫార్మర్‌లను ఏర్పాటు చేసి వాటి చుట్టూ జనరేటర్లను సైతం ఏర్పాటు చేస్తున్నారు. జాతీయ రహదారి అధికారుల నుంచి ఎలాంటి ఎన్‌ఓసి లేకుండా ట్రాన్స్ఫర్మర్లను ఏర్పాటు చేస్తున్నారని వాహనాదారులు ప్రజలు ఆగ్రహం వ్యక్తులు చేస్తున్నారు. ఇలాంటి నిర్మాణాలు భవిష్యత్తులో జాతీయ రహదారి విస్తరణ పనులకు అడ్డంకిగా మారే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రహదారి విస్తరణ సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లు,వాటి పరిసర నిర్మాణాలను తొలగించే పరిస్థితి వస్తే భవన యజమానుల నుంచి అభ్యంతరాలు తలెత్తి అభివృద్ధి పనులు ఆలస్యమయ్యే అవకాశముందని పేర్కొంటున్నారు.ఈ వ్యవహారంపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు నిబంధనలకు అనుగుణంగా జరిగిందా లేదా అనే అంశాన్ని పరిశీలించి,అవసరమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**ఏడీఈ రమేష్ మాట్లాడుతూ...**

రహదారులపై ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను అవసరమైన చోట తొలగించే చర్యలు తీసుకుంటాం .ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు పూర్తిగా నిబంధనలకు అనుగుణంగానే జరుగుతుంది. ఒకవేళ కింది స్థాయి సిబ్బంది వల్ల ఎక్కడైనా తప్పిదం జరిగి ఉంటే,దానిపై విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# వర్షా లతో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు

- **సిద్దిపేట రోడ్డులో గుంతల పూడ్చివేతకు మున్సిపాలిటీ చర్యలు**
- **చైర్ పర్సన్ లావణ్య నాగరాజు, కమిషనర్ రవీందర్ పరిశీలన**

**రామయంపేట, ఆగస్టు 1( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :**





ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు రామయంపేట మున్సిపల్ యంత్రాంగం చర్యలు వేగవంతం చేసింది. పట్టణంలోని సిద్దిపేట రోడ్డులో వివేకానంద విగ్రహం నుంచి ధర్మారం రోడ్డు వరకు ఏర్పడిన గుంతలను శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు,మున్సిపల్ కమిషనర్ ఏ. రవీందర్ తో కలిసి పరిశీలించారు.రోడ్డుపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించిన అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో మున్సిపల్ సిబ్బంది టిప్పర్లు, జేసీబీ, కార్మికుల సహాయంతో మెటీరియల్ వేసి గుంతలను పూడ్చివేశారు. వర్షపు నీరు రోడ్డుపై నిల్వ ఉండకుండా డ్రైనేజీలకు డ్రిల్ మెషిన్ తో రంధ్రాలు వేసి నీటి పారుదల సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టారు. పనుల పురోగతిని అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి, నాణ్యతలో రాజీ పడకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. వర్షాకాలంలో పట్టణంలోని ప్రధాన రహదారులు, కాలువలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు కొనసాగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు మాట్లాడుతూ, వర్షాకాలంలో రహదారులు, డ్రైనేజీల సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ పట్టణంలో మౌలిక వసతుల మెరుగుదలకు నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వర్క్ ఇన్ స్పెక్టర్లు డి.రంజిత్,కౌన్సిలర్లు పుట్టి సందీప్, డాకి స్వామి, చింతల స్వామ కే. ప్రసాద్, వాటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో మాతా-శిశు సంరక్షణ కార్యక్రమం..

- **చిన్నారులకు టీకాలు.**
- **1 నుంచి 5 సంవత్సరాల చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల పంపిణీ**
- **గర్భిణీ స్త్రీలకు పోషకాహారం, ఆరోగ్య సంరక్షణపై సూచనలు**
- **తల్లి, బిడ్డ ఆరోగ్యమే కుటుంబ సంక్షేమానికి పునాది అని వైద్య సిబ్బంది వెల్లడి**

**రామాయంపేట, ఆగస్టు 1 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్):**



మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నాడు మాతా-శిశు సంరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు సమతుల్య పోషకాహారం తీసుకోవడం, గర్భధారణ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, తల్లి-శిశు ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన సూచనలను వైద్య సిబ్బంది వివరించారు.అదేవిధంగా 1 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు ప్రభుత్వ ఆరోగ్య కార్యక్ర మంలో భాగంగా వ్యాధి నిరోధక టీకాలు వేశారు. చిన్నారులకు అన్ని టీకాలను నిర్ణీత సమయానికి వేయించడం ద్వారా అనేక అంటు వ్యాధులను నివారించ వచ్చని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం అనిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు కె. సరళ రాణి, కె. చంద్రకళ, జి. రాధిక, కె. సుశీల పాల్గొని గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు ఆరోగ్య సూచనలు అందించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మాతా-శిశు కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

Printed, Published, Owned by MANNE LAXMAN Printed at Saketh Publications, 312, Trinetra Complex, Sangareddy, Telangana 502001 Published from SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001 P.H: 9908123780, Email:navajyothinews@gmail.com, RNI no. TGTEL/25/A2372, EDITOR: MANNE LAXMAN